Follow: @ANNTELUGU


ANN తెలుగు

30-08-2025

# మహా పత్రిక

శనివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 266 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

## భారత్-చైనా కలిసి
# పనిచేయాలి
### ప్రధాని మోదీ పిలుపు
### జపాన్ పెట్టుబడులకు ఆహ్వానం

**టోక్యో:** భారత్, చైనా రెండు దేశాలు కలిసి పని చేయాల్సిన అవసరముందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అస్థిరత దృష్ట్యా.. ప్రపంచ ఆర్థిక క్రమానికి ఓ స్థిరత్వాన్ని తీసుకురావాలంటే ఇరుదేశాలు ముందడుగు వేయక తప్పదన్నారు. డ్రాగన్‌తో పరస్పర గౌరవం, ఆసక్తి, సున్నితత్వంతో వ్యవహరిస్తూ.. Tవ్యూహాత్మక, ద్వైపాక్షిక

మిగతా 2లో

**టాప్ న్యూస్**



గణేష్ నిమజ్జనానికి
### కేంద్ర మంత్రి అమిత్ షా?
- అధికారికంగా రావాల్సి ఉన్న షెడ్యూల్

02



సినిమాలు చేస్తే
### తప్పేంటి?
- పవన్ కల్యాణ్ పార్టీని నిలబెట్టేందుకే చేస్తున్నా

02



### ఏం చేద్దాం మరి?
- అసెంబ్లీ సమావేశాలపై కేసీఆర్ వ్యూహరచన
- కేటీఆర్, హరీష్‌తో సుదీర్ఘచర్చలు

02


SRI GOLD
TRUSTED GOLD BUYERS


| బంగారం ధరలు | |
|---|---|
| 24 క్యారెట్ | 1,03,310 |
| 22 క్యారెట్ | 94,700 |
| సిల్వర్ (కేజీ) | 1,19,900 |



## షాకిచ్చిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం
- ఎస్టీ జాబితా నుంచి బంజారా, లంబాడా, సుగాళీలను తొలగించాలి
- సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన ఎమ్మెల్యే, మాజీ ఎంపీ
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు

వివరాలు 2లో



# ఆగమాగం
## వర్ష భీభత్సం.. వరద భయం

### మహోగ్రంగా గోదావరి
- మహారాష్ట్ర నుండి 10 లక్షల క్యూసెక్కుల వరద
- కాళేశ్వరం వద్ద 85 గేట్లు ఎత్తిన అధికారులు
- ములుగు, భద్రాద్రి జిల్లాల్లో డేంజర్
- ఉత్తర తెలంగాణకు తొలగని ముప్పు
- 2లక్షల ఎకరాల్లో పంట నష్టం
- వరద పరిస్థితులపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- హైదరాబాద్ లో మూసీ ఉగ్రరూపం..
- డేంజర్ లో సిటీలోని లోతట్టు ప్రాంతాలు

(మహా నెట్ వర్క్, హైదరాబాద్ )

ఆదిలాబాద్ ఆగమాగమైంది. కామారెడ్డి కకావికలమైంది. మెతుకుసీమ మెదక్ తీరని శోకం మిగిలింది. ఉత్తర తెలంగాణ అతలాకుతలమై అల్లాడింది. తేరుకునేలోపు.. కళ్ళముందు విధ్వంసం కనిపించింది. సముద్రానికో.. నదికో రంధ్రం పడ్డట్లు, ఎవరో శత్రువులు మీద కుమ్మరించి పోయినట్లు వాన ప్రజలను బెంబేలెత్తించింది. మూడురోజులుగా తెలంగాణ ప్రజలను అల్లాడిస్తున్న వాన.. ఇంకా భయపెడుతూనే ఉంది. ఈ వర్ష వివాదం ఇలా ఉంటే.. నదులు పొంగుతూ ముంపును హెచ్చరిస్తున్నాయి. గోదావరి మహోగ్రరూపం దాల్చుతోంది. గత మూడు రోజులుగా మెదక్, కామారెడ్డి,ఆదిలాబాద్,నిజామాద్ జిల్లాల్లో అతి భారీ

మిగతా 2లో

### సుందిళ్ల బ్యారేజీ 74 గేట్లు ఎత్తివేత

పెద్దపల్లి జిల్లా మంథని మండలం సిరిపురం వద్ద నిర్మించిన సుందిళ్ల(పార్వతి)బ్యారేజ్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. పార్వతీ బ్యారేజ్‌కు వస్తున్న వరద ఇన్‌ఫ్లో 8,50,230 క్యూసెక్కులు కాగా అదే స్థాయిలో దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు 74 గేట్లను అధికారులు ఎత్తి ఉంచారు. గోదావరి పరివాహక ప్రాంతమైన మంథని మండలం ఖాన్ సాయిపేట్, ఖానాపూర్, ఎక్లాస్‌పూర్, మంథని, విలోచవరం, పోతారం ఉప్పట్ల గ్రామాలలో గోదావరి ప్రవాహానికి వందల ఎకరాల్లో వరిపంట, ప్రత్తి పంటలు నీటిలో మునిగిపోయాయి. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## విద్యా ప్రమాణాలు
# పెంచాలి
### విద్యార్థులు, బోధన సిబ్బందికి ఫేషియల్ రికగ్నేషన్ తప్పనిసరి
- ఒకే విభాగం పరిధిలోకి విద్యా శాఖ నిర్మాణాలు
- గ్రీన్ ఛానల్‌లో మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపు
- విద్యా శాఖ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మహా :** పాఠశాలల నుంచి విశ్వ విద్యాలయాల వరకు ప్రతి విద్యా సంస్థలోనూ మెరుగైన బోధన సాగాలని, విద్యా బోధనలో నాణ్యత ప్రమాణాలు మరింతగా పెంచాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రొఫెషినల్ కోర్సులు బోధించే కళాశాలల్లో విద్యార్థులు, బోధన సిబ్బందికి ఫేషియల్ రికగ్నేషన్ తప్పనిసరి చేయాలని సీఎం ఆదేశించారు. ముఖ గుర్తింపుతో హాజరు శాతం మెరుగవడంతో పాటు ప్రొఫెషనల్ విద్యా సంస్థల్లో లోటు పాట్లను అరికట్టవచ్చన్నారు. విద్యా శాఖపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. విద్యా శాఖ పరిధిలో అదనపు గదులు, వంట గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహారీల నిర్మాణం వివిధ విభాగాలు చేపట్టడం సరికాదని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ నిర్మాణాల నాణ్యత ప్రమాణాలు, నిర్మాణ పర్యవేక్షణ, నిధుల

మిగతా 2లో





మీరు జర్నలిస్ట్ అవ్వాలనుకుంటున్నారా?

జర్నలిజంలో రాణించి సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను అరికట్టాలనుకుంటున్నారా? అయితే మీకిదే సువర్ణావకాశం

ANN SCHOOL OF JOURNALISMలో

జాయిన్ అయ్యి నిజమైన జర్నలిస్టులుగా గుర్తింపు తెచ్చుకోండి.

గృహిణులు, నిరుద్యోగులు, విద్యార్థులకు ఇదే మా ఆహ్వానం

అడ్మిషన్లు ప్రారంభమైనవి

అప్లికేషన్‌కు ఆఖరుతేదీ - సెప్టెంబర్ 4

తరగతులు ప్రారంభం : సెప్టెంబర్ 2వ వారం

పరిమితమైన సీట్లు, సీనియర్ పాత్రికేయులతో విద్యాబోధన

మీరున్న చోటు నుండే ఆన్‌లైన్‌లో జర్నలిజం క్లాసులు

త్వరపడండి...

8 వారాలు, 16 ఆన్‌లైన్ క్లాసులు

కోర్సు పూర్తైన విద్యార్థులకు జర్నలిజం సర్టిఫికెట్ ఇవ్వబడును

మెరిట్ స్టూడెంట్స్ కు ఇంటర్న్‌షిప్ అవకాశం.. రికమండేషన్ లెటర్

FOR ADMISSIONS CONTACT: +91 74369 39999

SCAN ME

APPLY ON OUR OFFICIAL WEBSITE: WWW.ANNSCHOOLOFJOURNALISM.COM

అడ్మిషన్లు ప్రారంభమైనవి ఆఖరుతేదీ - సెప్టెంబర్ 4 తరగతులు ప్రారంభం : సెప్టెంబర్ 2వ వారం




## స్పాట్‌లోనే సస్పెండ్ చేస్తాం
- అధికారులు యూరియా అక్రమ రవాణా అరికట్టాలి
- పంపిణీలో ఏ చిన్న అవకతవకలకు పాల్పడినా ఉపేక్షించేది లేదు
- అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరికలు
- ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో యూరియా సరఫరాపై మంత్రి సమీక్ష

02

### నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- సానుభూతితో వ్యవహరించి పేషెంట్లకు చికిత్స అందించాలి
- ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ సూచనలు
- నిమ్స్ లో పేషెంట్లకు అందుతున్న వైద్య సేవలపై ఉన్నతాధికారులతో సమీక్ష

వివరాలు 2లో

## నేటి నుంచే అసెంబ్లీ సమావేశాలు
- కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ ఎజెండాగా సెషన్స్
- చర్చించిన తర్వాత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే అవకాశం
- బీసీ రిజర్వేషన్ పెంపు, రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి అంశాలపై వాడీవేడీ చర్చ
- కాళేశ్వరంపై పీపీటీ ఇస్తామని స్పీకర్ ను కోరిన బీఆర్ఎస్ నేతలు
- ఇవాళే సీఎం అధ్యక్షతన కేబినెట్ భేటీ.. యూరియా కొరత, వరదలు, పంట నష్టంపై డిస్కషన్స్

02




# ఆగమాగం

(మొదటిపేజీ తరువాయి)



వర్షాలు పడుతుండగా, జనజీవనం అస్తవ్యస్థమయ్యింది. వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు తెగిపోతున్నాయి. ఊర్లకు ఊర్లు మునిగిపోయాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయాయి. రోడ్లు కొట్టుకుపోయాయి. వేలాది ఎకరాల్లో పంట నష్టపోయింది. రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఊర్లు ఏర్లుగా మారగా, ఊరేదో.. ఏరేదో అర్థంకాని భయానక పరిస్థితులు వందలాది గ్రామాల్లో ఉంది. పోలీసులు, ప్రభుత్వయంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తుండగా, ధ్వంసమైన వందలాది రోడ్లు.. చెరువులు, కుంటలు పునరుద్దరించబడాలంటే వేలకోట్లతో పాటు ఎంతో సమయం పట్టనుంది. భారీ వర్షాలతో భీతావహ పరిస్థితులు నెలకొనగా, మరోవైపు గోదావరి మహోగ్ర మవుతోంది.

**గోదావరి మహోగ్ర రూపం - కాళేశ్వరం వద్ద డేంజర్**

నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గోదావరి మహోగ్ర రూపం దాల్చింది. గోదావరి నదిపై నిర్మించిన ప్రాజెక్టులలో భారీగా వరదనీరు వచ్చి చేరడంతో ప్రాజెక్టులు నిండుకుండలా మారాయి. ఇదే పరిస్థితి రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల్లో నెలకొంది. గోదావరి పరివాహక ప్రాంతాలు వరద నీటిలోకి జారుకుంటున్నాయి. అధికారులు ఆ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ప్రాజెక్టుల వద్దకు ప్రజలు ఎవరూ వెళ్లకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో కాళేశ్వరం ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చి చేరుతోంది. అలాగే పెద్దపల్లి జిల్లాలోని సుందిళ్ల బ్యారేజ్‌కు అదేస్థాయిలో వరద వస్తోంది. వచ్చిన నీటిని వచ్చినట్లుగా గేట్లు ఎత్తి దిగువ విడుదల చేస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయిని దాటి ప్రవహిస్తుంది. తెలంగాణ, మహారాష్ట్రలలో కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ నుంచి భారీగా వరద వస్తుంది. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరదతో కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద జలకళ సంతరించుకుంది. భారీ వర్షాలతో గోదావరికి ఎగువ నుంచి ప్రవాహం పెరిగింది. ఎగువ నుంచి 9,71,880 క్యూసెక్కుల మేర ప్రవాహం వస్తుండటంతో 85 గేట్లు ఎత్తి దిగువకు అంతే మొత్తంలో నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో ఎగువ ప్రాంతంలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశించారు. రాష్ట్రవ్యాప్త పరిస్థితులపై సీఎం రేవంత్ రెడ్డి అధికారులతో హైలెవెల్ సమీక్ష జరిపారు. హైదరాబాద్ కు కూడా మూసీ ముప్పు పొంచి ఉంది. ప్రమాదకరంగా ప్రవహిస్తోంది.

**తెలంగాణలో 2 లక్షల 20 వేల ఎకరాల్లో పంట నష్టం**

భారీ వర్షాల కారణంగా పంట నష్టాలపై ఆగస్టు 29 ప్రాథమిక రిపోర్ట్ విడుదల చేసింది. ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షాలు రాష్ట్ర వ్యాప్తంగా పంటలకు తీవ్ర నష్టం కలిగించాయని తెలిపింది. వ్యవసాయ శాఖ విడుదల చేసిన ప్రాథమిక నివేదిక ప్రకారం మొత్తం 28 జిల్లాల్లో 2 లక్షల 20 వేల443 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని... రాష్ట్రవ్యాప్తంగా లక్షా 43 వేల 304 మంది రైతులు నష్టపోయారని వ్యవసాయశాఖ అంచనా వేసింది. అత్యధికంగా కామారెడ్డి, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో పంటల నష్టం ఎక్కువగా నమోదైంది. కామారెడ్డి జిల్లాలోనే 77 వేల394 ఎకరాల పంటలు దెబ్బతిన్నాయి. మెదక్ జిల్లాలో 23 వేల169 ఎకరాలు, ఆదిలాబాద్‌లో 21 వేల276 ఎకరాలు, నిజామాబాద్‌లో 18 వేల 417 ఎకరాలు, కొమురం భీం ఆసిఫా బాద్ జిల్లాలో 15వేల 317 ఎకరాల్లో పంటలు నష్టపోయాయి. ఆ తర్వాత అత్యధికంగా నష్టపోయిన జిల్లాల్లో మంచిర్యాల, ఖమ్మం, నిర్మల్, సూర్యపేట, సిద్దిపేట సంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట, గద్వాల ,పెద్దపల్లి, వనపర్తి, భూపాలపల్లి, మహబూబ్ నగర్ , ములుగు,సిరిసిల్లా, నాగర్ కర్నూల్, నల్గొండ, జగిత్యాల రంగారెడ్డి, కరీంనగర్, మేడ్చల్, జనగాం, యాదాద్రి భువనగిరి జిల్లాలు ఉన్నాయి. జిల్లాల వారీగా చూస్తే వరి పంట అత్యధికంగా దెబ్బతింది. మొత్తం 1.09 లక్షల ఎకరాలు వరి నీట మునిగింది. పత్తి 60 వేల ఎకరాలు నష్టం చవిచూసింది. మెక్కజొన్న 16 వేల ఎకరాలు, వేరుశనగ 20వేల 900 ఎకరాల్లో దెబ్బతింది. సోయాబీన్, టమాట, మిర్చి, మినుములు, ఇతర హార్టికల్చర్ పంటలు కూడా గణనీయంగా దెబ్బతిన్నాయని తెలిపింది.



# స్పాట్‌లోనే సస్పెండ్ చేస్తాం

- అధికారులు యూరియా అక్రమ రవాణా అరికట్టాలి
- పంపిణీలో ఏ చిన్న అవకతవకలకు పాల్పడినా ఉపేక్షించేది లేదు
- అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరికలు
- ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో యూరియా సరఫరాపై మంత్రి సమీక్ష

**కూసుమంచి, మహా:** యూరియా పంపిణీలో ఏ చిన్న అవకతవకలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని, స్పాట్‌లోనే సస్పెండ్ చేయడం జరుగుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. పాలేరు నియోజకవర్గం పరిధిలో ఇక నుంచి ప్యాక్స్ కేంద్రాల ద్వారా మాత్రమే రైతులకు యూరియా సరఫరా చేయడం జరుగుతుందని, అధికారులు యూరియా అక్రమ రవాణాను అరికట్టాలని సూచించారు. శుక్రవారం కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సంబంధిత అధికారులతో కలిసి యూరియా సరఫరాపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్ష నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి.. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన స్థాయిలో యూరియా సరఫరా చేయని కారణంగా రాష్ట్రంలో కొంత యూరియా కొరత ఏర్పడిందన్నారు. సాంకేతిక సమస్యలతో రామగుండంలో (ఆర్‌ఎఫ్‌సీఎల్) ఉత్పత్తి నిలిచిపోయిందని, ఖమ్మం జిల్లాకు రాబోయే వారం రోజుల్లో 1600 మెట్రిక్ టన్నుల యూరియా రానుందని వెల్లడించారు.

**రైతులకు నేరుగా యూరియా..**

వ్యవసాయ సహకార సంఘాల ద్వారా యూరియా అమ్మకం యూనిట్లను పెంచాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. యూరియా పంపిణీకి వ్యవసాయ శాఖాధికారులు ఇతర శాఖల సిబ్బందిని వినియోగించుకోవాలని, రైతులకు నేరుగా యూరియా అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పాలేరు నియోజకవర్గంలో ఇక నుంచి ప్రైవేటు రంగానికి యూరియా బస్తాలు ఇచ్చే అవకాశం లేదన్నారు. వ్యవసాయ సహకార సంఘాల నుంచి అదనపు సబ్ సెంటర్లు ఏర్పాటు చేసి యూరియా పంపిణీ చేయాలని సూచించారు. సెప్టెంబర్ సీజన్ ముగిసే వరకు యూరియా అమ్మకాలకు అనుమతిస్తూ అధికారులు టెంపరరీ లైసెన్సులు జారీ చేయాలని చెప్పారు. యూరియా పంపిణీ పర్యవేక్షణకు రెవెన్యూ డివిజన్ అధికారిని నియమించాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు.

# ఏం చేద్దాం మరి?

- అసెంబ్లీ సమావేశాలపై కేసీఆర్ వ్యూహరచన
- కేటీఆర్, హరీష్ తో సుదీర్ఘచర్చలు

**హైదరాబాద్, మహా:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో గులాబీదళపతి కేసీఆర్ పార్టీ ముఖ్యనేతలు కేటీఆర్, హరీష్ లకు దిశానిర్దేశం చేశారు. కాళేశ్వరం రిపోర్ట్ నేపథ్యంలో కేసీఆర్, హరీష్‌మధ్య సుదీర్ఘ చర్చలు జరిగాయి. కాళేశ్వరం రిపోర్ట్ ప్రవేశపెడితే ప్రభుత్వదాడిని ఎలా ఎదుర్కోవాలనే అంశంపై చర్చించారు. రెండురోజులుగా హరీశ్ రావు ఫామ్‌హౌస్‌లోనే ఉన్నట్లు తెలుస్తోంది. కేటీఆర్ కూడా ఫామ్ హౌజ్ లోకు వెళ్లారు. సభను ఎలా ముందుకు తీసుకెళ్ళాలన్న అంశంపై నేతలకు దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. ఈసారి కూడా సభకు కేసీఆర్ వచ్చే అవకాశం కనిపించడం లేదు. తమకు కూడా పీపీటీ ఛాన్స్ ఇవ్వాలని కోరడం ద్వారా ప్రభుత్వం పీపీటీ ఇవ్వకుండా ముందస్తు బ్రేక్ వేసినట్లవుతుందని సర్కారు భావిస్తోంది.



## గణేష్ నిమజ్జనానికి కేంద్ర మంత్రి అమిత్ షా?

**మహా:** హైదరాబాద్ లో జరిగే గణేష్ నిమజ్జనంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొనే అవకాశముంది. సెప్టెంబర్ 6న జరగనున్న గణేష్ నిమజ్జనం కార్యక్రమానికి అమిత్ షా వచ్చే అవకాశముందని పార్టీ ముఖ్యులకు సమాచారమందింది. దేశంలో ముంబై, హైదరాబాద్ లలోనే గణేష్ ఉత్సవాలు అత్యంత భారీగా జరగనుండగా, అమిత్ షా పర్యటన షెడ్యూల్ అధికారికంగా రావాల్సి ఉంది.

# నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

**సానుభూతితో వ్యవహరించి పేషెంట్లకు చికిత్స అందించాలి**

ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ సూచనలు

నిమ్స్‌లో పేషెంట్లకు అందుతున్న వైద్య సేవలపై ఉన్నతాధికారులతో సమీక్ష



**హైదరాబాద్, మహా:** అత్యవసర పరిస్థితుల్లో నిమ్స్‌కు వస్తున్న పేషెంట్ల విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో నిమ్స్‌లో పేషెంట్లకు అందుతున్న వైద్య సేవలపై డైరెక్టర్ బీరప్ప, ఇతర ఉన్నతాధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. నిమ్స్‌లో ఈ ఏడాది తొలి 7 నెల్లలో (జనవరి నుంచి జులై) 5 లక్షల 44 వేల మందికి వైద్య సేవలు అందించామని బీరప్ప తెలిపారు. ఇందులో సగానికిపైగా ఆరోగ్యశ్రీ, ఈజేహెచ్‌ఎస్ వంటి ప్రభుత్వ పథకాల కింద ఉచితంగా చికిత్స పొందారని ఆయన తెలిపారు. ఎమర్జెన్సీకి వచ్చే పేషెంట్లలో నేరుగా నిమ్స్‌కు వచ్చే వారికి, ప్రభుత్వ హాస్పిటల్స్ నుంచి రిఫరల్‌పై వచ్చే వారికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటల్స్ నుంచి వచ్చే పేషెంట్ల విషయంలోనూ సానుభూతితో వ్యవహరించి చికిత్స అందించాలన్నారు.

**నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం..**

గాంధీ, ఉస్మానియా, నిమ్స్, ఇతర ప్రభుత్వ హాస్పిటళ్ల ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్ల నడుమ సమన్వయం ఉండాలని, ఒక హాస్పిటల్ ఎమర్జెన్సీ వార్డులో బెడ్లు నిండుకున్నప్పుడు పేషెంట్‌ను మరో హాస్పిటల్‌కు రిఫర్ చేసి అక్కడ అడ్మిట్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. పేషెంట్‌ను రిఫర్ చేయడానికి ముందే అవసరమైన ప్రాథమిక చికిత్స అందించి, స్టేబుల్ చేయాలన్నారు. ఒక హాస్పిటల్ నుంచి మరో హాస్పిటల్‌కు పంపించేటప్పుడు ఆ పేషెంట్‌తో పాటు అవసరమైతే అంబులెన్స్‌లో ఒక డాక్టర్‌ను పంపించాలని మంత్రి సూచించారు. పేషెంట్ల అడ్మిషన్, రిఫరల్ విషయంలో డ్యూటీ డాక్టర్లు, ఆర్‌ఎంవోలు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, మెడికల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్ వాణి, ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజారావు డాక్టర్ వాణి పాల్గొన్నారు.

# షాకిచ్చిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం

**ఎస్టీ జాబితా నుంచి బంజారా, లంబాడా, సుగాళీలను తొలగించాలి**

**సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన ఎమ్మెల్యే, మాజీ ఎంపీ**

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు**



**ఢిల్లీ, మహా :** బంజారా, లంబాడా, సుగాళీలను ఎస్సీ జాబితా నుంచి తొలగించాలని కోరుతూ భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, మాజీ ఎంపీ సోయం బాపురావు, మరికొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ల తరపున సుప్రీం కోర్టులో సీనియర్ అడ్వకేట్ అల్లంకి రమేష్ పిటిషన్ దాఖలు చేశారు. బంజారా, లంబాడాలు, సుగాళీలు గిరిజనులు కారని, 1976 వరకు ఉమ్మడి ఏపీలోని తెలంగాణ జిల్లాల్లో వారిని ఎస్టీలుగా పరిగణించలేదని, ఇతర రాష్ట్రాల నుంచి వారు తెలంగాణకు వచ్చి, అప్పటి నుంచి గిరిజనుల హక్కులను కొల్లగొడుతున్నారని పిటిషనర్లు తమ పిటిషన్ లో పేర్కొన్నారు. వాస్తవానికి మొదట బంజారా, లంబాడా, సుగాళీలు బిసి జాబితాలో ఉన్నారని కోర్టులో వేసిన పిటిషన్ లో తెలిపారు. పిటిషన్ విచారణ జరిపిన సుప్రీం కోర్టు జస్టిస్ జే కే మహేశ్వరి, జస్టిస్ బిష్ణోయ్ ధర్మాసనం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో రిజైండర్ దాఖలు చెయ్యాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది.



## సినిమాలు చేస్తే తప్పేంటి?

**పవన్ కల్యాణ్ పార్టీని నిలబెట్టేందుకే చేస్తున్నా..**

**విశాఖ:** జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిర్వహిస్తోన్న సేనతో సేనాని సమావేశం శుక్రవారం ప్రారంభం అయింది. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. జనం కోసం జనసేన నిరంతరం నిలబడుతుందని ప్రకటన చేశారు. నిస్వార్థ జనసైనికులు, వీరమహిళలే జనసేన బలం అని చెప్పారు. వచ్చే ఆవిర్భావ సభ నాటికి సంస్థాగత సైన్యం సిద్ధం కాబోతోందని అన్నారు. పార్టీని నిలబెట్టేందుకే సినిమాలు చేస్తున్నాను అని స్పష్టం చేశారు. అయినా సినిమాలు చేస్తే తప్పేంటని విమర్శకులను ప్రశ్నించారు. అక్టోబర్ నుంచి పార్టీ కేడర్‌తో సమావేశమవుతానని అన్నారు. తనకు కులం, మతంతో సంబంధం లేదని.. ప్రతీ అంశంపై మానవత్వంతో స్పందిస్తా అని అన్నారు.

## భారత్-చైనా కలిసి పనిచేయాలి

(మొదటిపేజీ తరువాయి)

సంబంధాలను ముందుకు తీసుకువెళ్లడానికి భారత్ సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. జపాన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్‌చైనాల మధ్య బలపడనున్న స్థిరమైన, స్నేహపూర్వక ద్వైపాక్షిక సంబంధాలు ప్రాంతీయ, ప్రపంచ శాంతి, శ్రేయస్సుపై సానుకూల ప్రభావాన్ని చూపుతాయన్నారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆహ్వానం మేరకు జపాన్ పర్యటన అనంతరం చైనాకు వెళ్లనున్నట్లు మోదీ తెలిపారు. గతేడాది ఓ కార్యక్రమంలో అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో పలు ద్వైపాక్షిక అంశాల గురించి చర్చించినట్లు పేర్కొన్నారు. పలు సవాళ్ల పరిష్కారానికి, కమ్యూనికేషన్‌ను మెరుగుపరుచుకోవడానికి భారత్, చైనాలు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. మేకిన్ ఇండియా కోసం రావాలని.. ప్రపంచం కోసం తయారీ చేపట్టాలని ఈ సందర్భంగా ప్రధాని మోదీ వ్యాపారవేత్తలకు పిలుపునిచ్చారు. సెమీకండక్టర్ల పరిశ్రమల నుంచి స్టార్టప్‌ల వరకూ జపాన్ భారత్‌కు అత్యంత కీలక భాగస్వామిగా ఉందని ప్రధాని పేర్కొన్నారు. జపాన్ సంస్థలు భారత్‌లో 40 బిలియన్ డాలర్లకుపైగా పెట్టుబడులు పెట్టాయని గుర్తుచేశారు.

# విద్యా ప్రమాణాలు పెంచాలి

## విద్యార్థులు, బోధన సిబ్బందికి ఫేషియల్ రికగ్నేషన్ తప్పనిసరి

- ఒకే విభాగం పరిధిలోకి విద్యా శాఖ నిర్మాణాలు
- గ్రీన్ ఛానల్‌లో మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపు
- విద్యా శాఖ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి



(మొదటిపేజీ తరువాయి)

మంజూరు, జవాబుదారీతనానికి గానూ ఒకే విభాగం కింద ఉండాలన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న విద్యా, సంక్షేమ వసతుల అభివృద్ధి సంస్థ కిందనే రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థల నిర్మాణాలు కొనసాగాలని సీఎం ఆదేశించారు. ఈ సంస్థకు అవసరమైన ఇంజినీరింగ్, ఇతర సిబ్బందిని ఇతర విభాగాల నుంచి వెంటనే డిప్యూటేషన్‌పై తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపును గ్రీన్ ఛానల్‌లో చేపట్టాలని, ఈ విషయంలో ఎటువంటి అలసత్వం చూపొద్దని సీఎం అన్నారు. తెలంగాణలోని మహిళా కళాశాలలు, బాలికల పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. కంటైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలని, కంటైనర్లపైన సోలార్ ప్యానెళ్లతో అవసరమైన విద్యుత్ వినియోగించుకోవచ్చని సీఎం తెలిపారు. ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అవసరమైతే కాంట్రాక్ట్ పద్ధతిన వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే అంశాన్ని పరిశీలించాలని అధికారులను సీఎం ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులకు సంబంధించిన బిల్లులు తక్షణమే విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని బాలికలకు వివిధ అంశాలపై కౌన్సెలింగ్ ఇచ్చేందుకు మహిళా కౌన్సెలర్లను నియమించాలని సీఎం సూచించారు. విద్యా రంగంపై పెడుతున్న ఖర్చును తాము ఖర్చుగా కాక పెట్టుబడిగా చూస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. యంగ్ ఇండియా ఇంటెగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూళ్లతో పాటు విద్యా రంగం అభివృద్ధికి తీసుకునే రుణాలను ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలో లేకుండా చూడాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారని సీఎం తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న వారిలో 90 శాతానికి పైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలే ఉన్నారని, ఈ విషయాన్ని నిర్ధారించేందుకు గత పదేళ్లలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివిన వారి వివరాలపై నివేదిక రూపొందించాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ దేవసేన, పాఠశాల విద్యా శాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ పాల్గొన్నారు.

# నేటి నుంచే అసెంబ్లీ సమావేశాలు

**కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ ఎజెండాగా సెషన్స్**

చర్చించిన తర్వాత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే అవకాశం

బీసీ రిజర్వేషన్ పెంపు, రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి అంశాలపై వాడీవేడీ చర్చ

కాళేశ్వరంపై పీపీటీ ఇస్తామని స్పీకర్ ను కోరిన బీఆర్ఎస్ నేతలు

ఇవాళే సీఎం అధ్యక్షతన కేబినెట్ భేటీ.. యూరియా కొరత, వరదలు, పంట నష్టంపై డిస్కషన్స్



**హైదరాబాద్, మహా:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలకు సర్కార్ సిద్ధమైంది. ఇవాళ ఉదయం 10.30 గంటలకు ఉభయసభలు ప్రారంభం కానున్నాయి. ఈసారి జరగబోయే సమావేశాలు వాడీవేడీగా కొనసాగే అవకాశం ఉంది. కాళేశ్వరంపై జస్టిస్ ఘోష్ కమిటీ ఇచ్చిన నివేదికను సభలో పెట్టేందుకు సర్కార్ సిద్ధమవుతోంది. సభలో చర్చించిన తర్వాత--- ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అయితే ఈ నివేదికపై చర్చ సందర్భంగా ప్రతిపక్ష నేత కేసీఆర్ వస్తారా లేదా అనేది ఆసక్తికరంగా మారింది.

**ఆ అంశాలపై వాడీవేడీ చర్చ..**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌పై జీఓ జారీ చేసే విషయంపై కూడా సర్కార్ కసరత్తు చేస్తోంది. సభ మొదటిరోజు పూర్తయ్యాక కేబినెట్ భేటీ కానుంది. ఇందులో బీసీ రిజర్వేషన్ జీవోపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సభను ఎన్నిరోజులు నిర్వహిస్తారనే దానిపై బీఏసీలో నిర్ణయం తీసుకున్నారు. ఆగస్టు 4న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికపై చర్చించి ఆమోదించిన సంగతి తెలిసిందే. త్వరలోనే అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేసి నివేదికపై సమగ్ర చర్చ అనంతరం భవిష్యత్ కార్యాచరణను నిర్ణయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా తెలిపారు. బీసీ రిజర్వేషన్ పెంపు, రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి అంశాలపై వాడీవేడీ చర్చ జరగనుంది.

**నేడు మంత్రివర్గ సమావేశం..**

మరోవైపు రాష్ట్రంలో యూరియా కొరతతో పాటు పలు చోట్ల రైతులు ఆందోళనలు చేస్తున్నారు. దీనిపై కూడా సభలో చర్చించే అవకాశం ఉంది. వెనుకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్లు వంటి అంశాలపై వాడీవేడీగా చర్చ జరిగే సూచనలున్నాయి. మొత్తంగా ఈసారి జరగబోయే శాసనసభ సమావేశాలు అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రసవత్తరంగా సాగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన మధ్యాహ్నం కేబినెట్ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో యూరియా కొరత, వరదలు, పంట నష్టంపై, ఉద్యోగుల సమస్యలపై డిస్కషన్స్ ఉంటాయని తెలుస్తోంది.

# పింఛన్ల సమస్యలకు ఫుల్ స్టాప్

## చేయూత పింఛన్ల పంపిణీలో సాంకేతిక విప్లవం

ఇక నుంచి పారదర్శకంగా, వేగవంతంగా పింఛన్ల పంపిణీ: సీతక్క

రాష్ట్రవ్యాప్తంగా 6300 మంది పోస్టుమాస్టర్లకు 5జీ మొబైల్ ఫోన్లు, ఎల్ 1 ఫింగర్ ప్రింట్ మెషీన్లు



**ములుగు, మహా:** ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచే దిశగా పింఛన్ పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, వేగం పెరిగి పింఛన్ దారులకు సత్వర సేవలు అందుతాయని మంత్రి సీతక్క పేర్కొన్నారు. పింఛన్ దారుల సమస్యల దృష్టిలో పెట్టుకొని నూతన విధానాన్ని ప్రవేశపెట్టినట్లు మంత్రి సీతక్క తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని చేయూత సామాజిక భద్రత పింఛన్ల పథకం అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, వితంతులు, ఒంటరి మహిళలు, హెచ్ఐవీ, డయాలసిస్ భాదితులు, గీత కార్మికులు, బీడీ కార్మికులకు ఆర్థిక భరోసా లభిస్తోంది. ప్రస్తుతం మొత్తం పదకొండు రకాల పింఛన్లు చేయూత పథకం కింద ప్రభుత్వం అందజేస్తోంది. ఇప్పటి వరకు పింఛన్ దారుల ధృవీకరణ కోసం 2జీ ఆధారిత ఫింగర్ ప్రింట్ పరికరాలను వినియోగిస్తున్నారు. ఇప్పుడు వాటి స్థానంలో ఆధునిక సాంకేతికతతో కూడిన ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు సాఫ్ట్‌వేర్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

**6,300 బ్రాంచ్ పోస్టుమాస్టర్లకు స్మార్ట్ మొబైల్ ఫోన్లు..**

ఈ కొత్త విధానం ద్వారా 'సరైన వ్యక్తికి - సరైన పింఛన్ - సరైన సమయంలో' అందేలా పింఛన్ పంపిణీ మరింత ఖచ్చితంగా, పారదర్శకంగా మారనుంది. ఈ కార్యక్రమం కోసం ప్రభుత్వం రూ.15.50 కోట్ల బడ్జెట్‌తో 5జీ ఆధారిత ఎల్ 1 ఫింగర్ ప్రింట్ పరికరాలు, కొత్త మొబైల్ ఫోన్లను కొనుగోలు చేసింది. ప్రయోగాత్మకంగా కొన్ని జిల్లాల్లో ఈ పరికరాలను ప్రభుత్వం వినియోగించింది. ఆశించిన ఫలితాలు రావడంతో రాష్ట్రవ్యాప్తంగా 6,300 బ్రాంచ్ పోస్టుమాస్టర్లకు స్మార్ట్ మొబైల్ ఫోన్లు, పరికరాలు పంపిణీ చేయనున్నారు. స్మార్ట్ మొబైల్ ఫోన్లు పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి సీతక్క ములుగు జిల్లాలోని పస్రా కేంద్రంలో ములుగు జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర్‌తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. కొద్ది రోజుల్లోనే రాష్ట్ర వ్యాప్తంగా 6300 మంది పోస్టుమాస్టర్లకు పరికరాలను అందజేయనున్నారు. ఫేస్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్‌ను టీజీ ఆన్‌లైన్ ప్రత్యేకంగా అభివృద్ధి చేసింది. కొత్త సాంకేతిక పరిష్కారం వల్ల పింఛన్ దారుల ధృవీకరణ సమయం మూడు సెకన్లకు తగ్గి, పింఛన్లు వేగంగా పంపిణీ అవుతాయి. దీంతో లబ్ధిదారులు ఎక్కువ సేపు వేచి ఉండాల్సిన అవసరం లేకుండా వెను వెంటనే తమ పింఛన్లు అందుకుంటారు. ముఖ్యంగా వ్యవసాయ కూలీలు, వృద్ధులు, వేలి ముద్రలు చెరిగిన వారు వంటి వారికి ముఖ గుర్తింపు యాప్ ఎంతో మేలు చేస్తోంది.



## గణనాథుడికి కంది మౌనా శ్రీనివాస రెడ్డి పూజలు

**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ జిల్లాలో వినాయక నవరాత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయం ప్రజా సేవాభవన్ లో ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరుడిని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి దర్శించుకున్నారు. గణపతి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజ అనంతరం గణనాయకునికి హారతి తో పాటు నైవేద్యాలు సమర్పించారు. ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆమె వినాయకుడిని ప్రార్థించారు.

# కేసీఆర్ ప్రభుత్వంపై కాంగ్రెస్ అబద్ధాలు

## కేటీఆర్ ఫైర్



**హైదరాబాద్, మహా:** తెలంగాణలో కొత్త ప్రభుత్వం వచ్చాక ఆర్థిక పరిస్థితిపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని బయటపెడుతూ పలు విషయాలను ఆయన ట్విట్టర్ వేదికగా వెల్లడించారు.

**ప్రతి నెలా రూ.7,000 కోట్ల వడ్డీ చెల్లిస్తున్నారనేది అబద్ధం**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక దుష్ప్రచారానికి పాల్పడుతుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు రాష్ట్రం ప్రతి నెలా రూ.7,000 కోట్ల రుణ వడ్డీ చెల్లిస్తోందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. అయితే, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (CAG) నివేదిక ఈ వాదన తప్పని తేల్చిందని ఆయన స్పష్టం చేశారు. వాస్తవానికి, గత నాలుగు నెలల్లో సగటు నెలవారీ వడ్డీ చెల్లింపు కేవలం రూ.2,300 కోట్లు మాత్రమేనని (4 నెలల్లో రూ.9,355 కోట్లు) పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఉద్దేశపూర్వకంగా రాష్ట్ర రుణ భారాన్ని ఎక్కువ చేసి చూపిస్తుందని ఆయన విమర్శించారు. తెలంగాణ ప్రజలను తప్పుదారి పట్టించే ఈ దుష్ప్రచారాన్ని వెంటనే ఆపాలని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాలని డిమాండ్ చేశారు.

**వర్షా లతో ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే.. సీఎం రేవంత్ విలాసాలపై దృష్టి**

తెలంగాణలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రజల జీవనం స్తంభించిపోయిందని కేటీఆర్ అన్నారు. ఈ వర్షాల వల్ల పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తినష్టం జరిగిందని, ప్రజలు సహాయం కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ప్రజల కష్టాలను పట్టించుకోకుండా, విలాసవంతమైన, లాభదాయకమైన ప్రాజెక్టులపై సమీక్షలు నిర్వహిస్తున్నారని ఆయన విమర్శించారు. రూ. 3,50,000 కోట్ల 2036 ఒలింపిక్స్ నిర్వహణ, రూ. 1,50,000 కోట్ల మూసీ సుందరీకరణ, రూ. 225 కోట్ల హైదరాబాద్ బీచ్ ప్రాజెక్టుల గురించి చర్చలు జరుపుతున్నారని పేర్కొన్నారు. ప్రజల గోడును గాలికొదిలేసి, డబ్బు సంపాదించే పనులపైనే రేవంత్ అండ్ కో దృష్టి పెట్టిందని కేటీఆర్ దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గు లేకుండా వ్యవహరిస్తుందని, ఇది ప్రజా పాలన కాదని ఆయన ట్వీట్ చేశారు.


**జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కేటీఆర్ ట్వీట్**

కేటీఆర్ జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ధ్యాన్ చంద్ జయంతిని గుర్తు చేసుకుంటూ ట్వీట్ చేశారు. ఆటలు మనకు సహకారం, పోరాట స్ఫూర్తిని నేర్పిస్తాయని అన్నారు. "మనం కిందపడితే అది ముఖ్యం కాదు, మళ్లీ ఎలా పైకి లేచామన్నదే ముఖ్యం" అని పేర్కొన్నారు. కష్టాలను అధిగమించి మనకు స్ఫూర్తినిచ్చిన అద్భుతమైన క్రీడాకారులను మనం గౌరవించుకోవాలని పిలుపునిచ్చారు.

# రూపాయికి కిలో ఉల్లి

## కర్నూలు మార్కెట్ యార్డ్ లో ఉల్లి రైతు ఆర్తనాదాలు

వారం రోజుల నుంచి కొనే దిక్కు లేక మార్కెట్ యార్డ్ లో వేచి చూస్తున్న రైతులు



**కర్నూల్, మహా:** నిన్నటి వరకు వినియోగదారులకు కన్నీరు తెప్పించిన ఉల్లి ఇప్పుడు పంట పండించిన రైతులను ఏడిపిస్తుంది. కష్టపడి పండించిన పంట అమ్మితే కనీసం ఆటో బాడిగలకు రాలేదని వాపోయిన రైతులు, ఒక ఎకరా ఉల్లిని పండించడానికి లక్ష నుండి 1,30,000 ఖర్చు అవుతుందని కానీ పంట 50 నుంచి 70 క్వింటాలు వచ్చినా మార్కెట్లో క్వింటాల్ 100 నుంచి 300 మాత్రమే ధర పలుకుతుందని ఈ విధంగా అయితే ఒక ఎకరాకు 20 నుంచి 30 వేలు మాత్రమే చేతికొస్తాయని రైతులు కన్నీరు మున్నీరయ్యారు..జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఉల్లి ధర తగ్గితే ప్రభుత్వం కొనుగోలు చేసి రాష్ట్రంలో ఉన్నటువంటి రైతు బజార్ల ద్వారా విక్రయించి రైతులను ఆదుకుందని కానీ కూటమి ప్రభుత్వం రైతులను పట్టించుకోవడంలేదని వాపోయారు. ఒకవైపు ఎరువులు లేక పురుగు మందుల ధరలు పెరిగి ఎంతో కష్టపడి పంట పండిస్తే కనీసం కూలీ ఖర్చులకు చెల్లించలేని దుస్థితి నెలకొందని మార్కెట్ యార్డ్ నుంచి ఇంటికి వెళ్లలేని పరిస్థితిలో ఉన్నామని రైతులు మొరపెట్టుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆత్మహత్యలే శరణ్యమని రైతులు చెప్తే..ఎస్వీమోహన్ రెడ్డి భయపడొద్దు అలాంటి తప్పుడు ఆలోచనలు చేయవద్దని మీకు అండగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జగన్ మోహన్ రెడ్డి ఉంటారని మీకోసం పోరాడుతారని ధైర్యం చెప్పారు. ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ గతంలో పొగాకుకు ధర పడిపోతే జగన్ మోహన్ రెడ్డి ఒంగోలు రైతులను పరామర్శిస్తే అప్పుడు ప్రభుత్వం మేల్కొందని, మిర్చికి ధర పడిపోతే జగన్ మోహన్ రెడ్డి గుంటూరు మార్కెట్ యార్డుకు వెళ్తే ప్రభుత్వం కదిలిందని, మామిడి ధర పడిపోతే రైతులను జగన్ మోహన్ రెడ్డి పరామర్శిస్తే కేంద్ర ప్రభుత్వం కదిలిందని కావున ఉల్లి రైతుల కోసం కూడా జగన్ మోహన్ రెడ్డి అండగా ఉంటాడని తెలియజేశారు. ప్రభుత్వం వెంటనే ఉల్లిని రూ. 2,000 నుంచి రూ. 5,000 వరకు కొనుగోలు చేసి రాష్ట్రంలో రైతు బజార్లలో విక్రయించాలని డిమాండ్ చేశారు.. వంగాల భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో ప్రధానమైన పంట ఉల్లి పంట అని రాష్ట్రంలో సాగు జరిగే ఉల్లిలో 90% కర్నూల్ జిల్లాలోనే సాగు చేస్తారని సంవత్సరంలో మార్కెట్ కు వచ్చే మొట్టమొదటి పంట కూడా ఉల్లి పంటనే అని సీజన్ మొదట్లోనే ఈ పరిస్థితి ఉంటే ఇంకా 50 రోజుల పైన ఉల్లి పంట మార్కెట్ కి వస్తుందని వారం రోజుల నుంచి రైతులు అష్టకష్టాలు పడుతున్నారని కనీసం వారి వైపు ప్రభుత్వం కాని అధికారులు కానీ చూసిన దాఖలాలు లేవని విమర్శించారు.. కనీసం ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి ఉల్లిని కొనుగోలు చేసి రైతులను ఆత్మహత్యల నుంచి కాపాడాలని డిమాండ్ చేశారు .

## తెలంగాణ విజిలెన్స్ కొత్త డీజీగా విక్రమ్ సింగ్ మాన్

### కొత్తకోట శ్రీనివాసరెడ్డి పదవీవిరమణ



**హైదరాబాద్ :** తెలంగాణ విజిలెన్స్ కొత్త డీజీగా విక్రమ్ సింగ్ మాన్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం డీజీగా విధులు నిర్వహిస్తున్న 1994 బ్యాచ్‌కు అధికారి కొత్తకోట శ్రీనివాస రెడ్డి పదవీకాలం ఈనెల 31వ తేదీతో ముగియనుంది. ఆయన పదవీ విరమణతో ఖాళీ అవుతున్న స్థానాన్ని విక్రమ్ సింగ్ మాన్‌తో భర్తీ చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ అడిషనల్ కమిషనర్‌గా విక్రమ్ సింగ్ కొనసాగుతున్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఆయన అదనపు భాద్యతలలో కొనసాగనున్నారు.

# భారీ వర్షాలతో 1039 కి.మీ మేర రోడ్లు ధ్వంసం

## 31 చోట్ల తెగిపోయిన రోడ్ లు ..10 చోట్ల తాత్కాలిక మరమ్మత్తులు

356 చోట్ల కాజ్ వేలు, కల్వర్టులు ధ్వంసం.. ఆర్ అండ్ బీ వెల్లడి

**హైదరాబాద్,మహా :** రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తం అయ్యింది. పలు జిల్లాలు జలమయం అయ్యాయి. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా రెండు రోజుల్లో రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. భారీ వర్షం కారణంగా.. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వంతెనలు కూలాయి. కల్వర్టులు కొట్టుకుపోయాయి. వాగులు పొంగాయి. ఊళ్లకు ఊళ్లే జలదిగ్బంధమయ్యాయి. రహదారులు ధ్వంసమై వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో పలు ప్రాంతాల్లో గంటలకొద్దీ ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఈ నేపథ్యంలో ఆర్ అండ్ బీ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 37 ఆర్ అండ్ బీ డివిజన్ల నుండి సమాచారం అందినట్లు అధికారులు తెలిపారు. వర్షాల కారణంగా ఇప్పటి వరకు 794 సమస్యాత్మక రోడ్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. మొత్తం 1039 కి.మీ రోడ్లు దెబ్బతిన్నాయని నివేదిక వచ్చినట్లు చెప్పారు. 31 చోట్ల రోడ్లు తెగిపోగా, 10 చోట్ల తాత్కాలిక పునరుద్ధరణ చేపట్టినట్లు స్పష్టం చేశారు. 356 చోట్ల కాజ్‌వేలు, కల్వర్టులు ధ్వంసం అయ్యాయన్నారు. 289 చోట్ల దారి మళ్లింపు చర్యలు ఏర్పాటు చేసినట్లు చెప్పుకొచ్చారు. రాకపోకలకు ఇబ్బంది ఉన్న 305 ప్రాంతాల్లో 236 ప్రాంతాలు ఇప్పటికే క్లియర్ చేసినట్లు వెల్లడించారు. మొత్తం 206 చోట్ల సిడీ వర్క్స్ దెబ్బతిన్నాయని వివరించారు. తాత్కాలిక పునరుద్ధరణ పనులకు రూ.53.76 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసినట్లు స్పష్టం చేశారు. శాశ్వత పునరుద్ధరణ పనులకు రూ.1157.46 కోట్లు అవసరం అవుతుందని అధికారులు తెలియజేశారు..

# నాకు పార్టీలతో పని లేదు.. మీకోసం పనిచేస్తా

## ట్రిపుల్ ఆర్ రైతుల సమస్యపై సీఎంతో మాట్లాడతా:ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

**చౌటుప్పల్, మహా :** తనకు పార్టీలతో పని లేదని.. మునుగోడు ప్రజల కోసం పనిచేస్తానని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డిని ట్రిపుల్ ఆర్ రైతులు కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. ట్రిపుల్ ఆర్ రైతుల సమస్యల కొరకు ఎంత వరకైనా వెళ్తానని చెప్పారు. ట్రిపుల్ ఆర్ అలైన్మెంట్ విషయంలో గత ప్రభుత్వం చౌటుప్పల్ రైతులకు అన్యాయం చేసిందన్నారు. దివిస్ కంపెనీతో గత ప్రభుత్వం కుమ్మక్కై అలైన్ మెంట్ మార్చి, రైతులను మోసం చేశారని ఆరోపించారు. ట్రిపుల్ ఆర్ రైతులకు సహాయం చేస్తానన్న రాజగోపాల్ రెడ్డి.. భూమి కోల్పోతున్న రైతులకు మంచి రేటు ఇప్పించే ప్రయత్నం చేస్తానని చెప్పారు. మరోసారి ట్రిపుల్ అలైన్ మెంట్ గురించి అధికారులుతో చర్చిస్తానని తెలిపారు. అసెంబ్లీలో ముఖ్యమంతితో మాట్లాడి ట్రిపుల్ ఆర్ రైతుల సమస్యను తెలియజేస్తానని చెప్పారు. తాను మునుగోడు ప్రజల అందరికీ ఎమ్మెల్యేనని.. తనతో కాకుంటే ఇంకెవరితోనూ ఈ పని కాదన్నారు. తనకు పార్టీలతో పని లేదని.. ప్రభుత్వంతో మాట్లాడి మీ సమస్య తీర్చేందుకు ప్రయత్నం చేస్తానని రాజగోపాల్ రెడ్డి అన్నారు.

# ఆర్టీఏ చెక్ పోస్టులు ఎత్తివేత


## ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, మహా:** తెలంగాణ ప్రభుత్వం రవాణా రంగంలో పారదర్శకతను పెంచడం, అవాంతరాలు లేని సేవలను అందించడం లక్ష్యంగా కీలక నిర్ణయాలు తీసుకుంది.. ఇందులో భాగంగా రవాణా శాఖకు చెందిన అన్ని చెక్‌పోస్టులనూ తక్షణమే రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ చర్యతో రాష్ట్రంలో చెక్‌పోస్టుల వద్ద జరిగే జాప్యం, అవినీతి వంటి సమస్యలకు ముగింపు పలకనుంది. కొత్తగా జారీ అయిన ఉత్తర్వుల ప్రకారం.. వాహన తనిఖీల కోసం ఇకపై మొబైల్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఈ మొబైల్ స్క్వాడ్‌లు వాహనాలను ఆరు నెలలకు ఒకసారి జిల్లా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (డీఈఓ) అనుమతితో తనిఖీ చేస్తాయి. ఇది అక్రమ రవాణాను నివారించడంలో సహాయపడుతుంది. రవాణా ఫీజులు, పన్నులు చెల్లించడానికి వాహన దారులకు ఆన్‌లైన్ సదుపాయం కల్పిస్తారు. వాహన తనిఖీలు, పన్నుల వసూలు కోసం ఏఎన్‌పీఆర్ (ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్) కెమెరాలు, ఇతర అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించనున్నారు. నిబంధనల ఉల్లంఘన, రవాణా చట్టాలను ఉల్లంఘించిన వాహనాలపై జరిమానాలు ఆన్‌లైన్‌లో విధిస్తారు. ఈ మార్పులన్నీ రాష్ట్ర రవాణా శాఖలో అవినీతిని తగ్గించి, పారదర్శకతను పెంచుతాయని ప్రభుత్వం తెలిపింది. ఈ ఉత్తర్వులన్నీ తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొంది.

# పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు చాన్స్ ఇవ్వండి

## కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ ఎల్పీకి పీపీటీ అవకాశం కల్పించాలి

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వినతిపత్రం



**హైదరాబాద్, మహా:** నేటి నుంచి ప్రారంభమయ్యే తెలంగాణ శాసనసభ సమావేశాల్లో కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ద్వారా వివరించే అవకాశాన్ని బీఆర్ఎస్ ఎల్పీకి కల్పించాలని ఆ పార్టీ ఎమ్మెల్యేలు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ. వివేకానంద, దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, శేరి సుభాష్ రెడ్డి, బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయ కార్యదర్శి ఎం. రమేష్ కుమార్ రెడ్డిలు శాసనసభ స్పీకర్‌ను కలిసిన ఈ మేరకు వినతి పత్రం అందించారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికపై నేటి నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చేసే వాదనను తిప్పికొట్టే క్రమంలో మా పార్టీ ఎమ్మెల్యేలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చాన్స్ ఇవ్వాలని బీఆర్ఎస్ ఎల్పీ కోరడం గమనార్హం.

ఉద్యోగావకాశం
పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టిస్తున్న
మహా పత్రికకు
(RNI NO: APTEL/2003/09316)
ఏపీ, తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు జిల్లాల వారీగా
స్టాఫ్ రిపోర్టర్లు
కావలెను
WWW.EPAPER.MAHAADAILY.COM
ఆసక్తి గల వారు సంప్రదించండి
MAHAAPATRIKA@GMAIL.COM,
95501 59679, 90001 41919

# క్లౌడ్ బరస్ట్‌తో వినాశనమే



**గత కొన్నేళ్లుగా దేశవ్యాప్తంగా ఒక కొత్త పదం తరచూ వినిపిస్తోంది – క్లౌడ్‌బరస్ట్. అకస్మాత్తుగా ఒక ప్రాంతంలో మేఘాలు పగిలిపడినట్లుగా గంటల వ్యవధిలో వందల మిల్లీమీటర్ల వర్షపాతం కురవడం వలన విపరీతమైన వరదలు వస్తాయి. ఈ ఘటనలు ప్రధానంగా హిమాలయ ప్రాంతం, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్ము-కాశ్మీర్, లడఖ్, సిక్కిం వంటి పర్వత ప్రాంతాల్లో తరచూ సంభవిస్తాయి. కానీ వాతావరణ మార్పులు, వాతావరణ చక్రంలో ఏర్పడుతున్న విపరిణామాల కారణంగా దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ క్లౌడ్‌బరస్ట్ ప్రభావాలు కనిపిస్తున్నాయి. "ఆకాశం పగిలిపోయినట్లు" అనిపించే ఈ విపత్తు ప్రాణ, ఆస్తి నష్టాలకు కారణమవుతూనే కాకుండా, స్థానిక పర్యావరణ వ్యవస్థకు గట్టి దెబ్బతీస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు జరిగిన ప్రధాన నష్టాలను, కారణాలను, పరిణామాలను, అలాగే భవిష్యత్తులో ఈ విపత్తులను ఎలా ఎదుర్కోవచ్చన్న దానిపై ఒక లోతైన విశ్లేషణ అవసరం.**

తెలంగాణలో తాజాగా అసాధరణ వర్షపాతం ప్రజలను బెంబేలెత్తుతోంది. కామారెడ్డిపై క్లౌడ్ బరస్ట్ కనివిని ఎరుగని నష్టాన్ని మిగిల్చిందని ప్రభుత్వపెద్దలు చెబుతున్నారు. కామారెడ్డిపై ఏకబిగిన 70 సెంమీ వర్షం కురిసిందని, ఇదే ఉత్పాతానికి కారణమన్న విశ్లేషణలున్నాయి. అధికారిక లెక్కల్లో క్లౌడ్ బరస్ట్ లేకున్నా.. అసాధరణ ప్రమాదకర వర్షపాతంగా పేర్కొంటున్నారు. తెలంగాణలో క్లౌడ్ బరస్ట్ అనే పదాన్ని మొట్టమొదట కేసీఆర్ ఉపయోగించారు. హైదరాబాద్ వర్షాలు, ఆ తర్వాత భద్రాచలం ప్రాంతంలో వరదలు వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లడంతో దీనికి క్లౌడ్ బరస్టే కారణమని ఆ సమయంలో చెప్పగా.. ట్రోల్స్ జరిగాయి. కానీ ఉత్తర భారతంలో తరచూ వింటున్న ప్రమాదాలతో ఆ క్లౌడ్ బరస్ట్ ఎంత డేంజరో ఇపుడు ఎక్కువ మందిలో అవగాహన పెరిగింది. అయితే అసలు క్లౌడ్ బరస్ట్ అంటే ఏంటి? మంచుకొండలు, పర్వత ప్రాంతాల్లో వచ్చే క్లౌడ్ బరస్ట్‌లు మన వద్ద కూడా వస్తాయా? అసలేంటి క్లౌడ్ బరస్ట్ ?

## క్లౌడ్ బరస్ట్ అంటే ఏంటి?

అతి తక్కువ ప్రాంతం (చిన్న ప్రాంతం)లో గంట వ్యవధిలో 100 మి.మీ. వర్షపాతం నమోదైతే దాన్ని క్లౌడ్ బరస్ట్ అంటారు. గాలి స్వల్పంగా వేడెక్కడం, దీనితో గాలిలో తేమ పెరిగి ఆకాశం వైపు ప్రయాణించి కుండపోత వర్షానికి కారణమవుతున్నది. ఎత్తైన పర్వతాలు కూడా క్లౌడ్ బరస్ట్ కు కారణమని నిపుణులు చెబుతున్నారు. వాతావరణంలో సగటు ఉష్ణోగ్రత ఒక డిగ్రీ పెరిగి, గాలి 7 శాతం అధికంగా తేమను కలిగి ఉంటే భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అస్తవ్యస్త పట్టణీకరణ, అడవులను నరికివేయడం, చిత్తడి నేలలు తగ్గిపోవడం, భూమిలో నీరు ఇంకకుండా నిరోధించడం కూడా క్లౌడ్ బరస్ట్ కు కారణమనే అభిప్రాయాలున్నాయి. తేమతో నిండిన గాలులు పర్వతాల వద్ద గాలిని కలిసినప్పుడు ఘనీభవనం ఏర్పడి క్లౌడ్ బరస్ట్ ఏర్పడుతోందని వాతావరణ అధ్యయనాలు చెబుతున్నాయి. భారత వాతావరణ శాఖ డాటా ప్రకారం దేశంలో కశ్మీర్, లద్దాఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని హిమాలయ ప్రాంతాల్లో క్లౌడ్ బరస్‌ట్‌లు ఎక్కువగా సంభవిస్తున్నాయి. పశ్చిమ హిమాలయాలలో తరచుగా ఇలాంటి కుంభవృష్టి వర్షాలు కురుస్తున్నాయి.

## క్లౌడ్ బరస్ట్ ఎందుకు వస్తోంది?

రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించినప్పుడు అరేబియా సముద్రం లేదా బంగాళాఖాతం నుంచి తేమతో కూడిన చల్లని గాలులు వీస్తాయి. వర్షం పడే పరిస్థితి ఉన్నా వేడి వాతావరణంతో మేఘాలు ఇంకా ఘనీభవిస్తాయి. అయితే ఇవి బరువు పెరిగి ఏదో ఒక సమయంలో విస్ఫోటం చెందుతాయి. అలా భారీ వర్షానికి కారణం అవుతాయి. తక్కువ టైంలోనే ఎక్కువ వర్షం రికార్డు కావడానికి ఈ మేఘాలు కారణమని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. అందుకే దీన్ని క్లౌడ్ బరస్ట్ అంటారు. ఎక్కువ భూమిపై భారీ వర్షం కురిస్తే ప్రభావం లేదా నష్టం అంతగా ఉండదు. తక్కువ ప్రాంతంలో ఎక్కువ వర్షం కురిస్తే తీవ్రత పెరుగుతుందని చెబుతున్నారు. నిటారుగా ఉన్న పర్వత ప్రాంతాలు, లోయలలో, భారీ వర్షం కురిస్తే ఆకస్మిక వరదలు కొండచరియలు విరిగిపడే అవకాశం ఉంది. ఉష్ణోగ్రతలు పెరిగే కొద్దీ గాలి తేమను ఎక్కువగా నిల్వ చేసుకొనేందుకు సామర్థ్యం పొందుతుంది. ఇది కూడా ఎక్కువ వర్షపాతం నమోదు కావడానికి కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

## తాజాగా ఉత్తరాఖండ్‌లో మరోసారి విపత్తు

ఇటీవల ఉత్తరాఖండ్‌లోని రుద్రప్రయాగ్, చమోలీ జిల్లాల్లో కురిసిన కుండపోత వర్షం పలు గ్రామాలను ముంచెత్తింది. తాజా క్లౌడ్‌బరస్‌ట్‌లో పలువురు ప్రాణాలు కోల్పోగా, పలుచోట్ల ఇళ్లు కూలిపోవడంతో పదుల సంఖ్యలో ప్రజలు శిథిలాల కింద చిక్కుకున్నారు. రహదారులు ధ్వంసమయ్యాయి, వంతెనలు కొట్టుకుపోయాయి. రక్షణ చర్యల్లో భాగంగా ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి.



## తెలంగాణలో కామారెడ్డి క్లౌడ్‌బరస్ట్

హిమాలయ ప్రాంతాల్లో మాత్రమే కాదు, తెలంగాణలోనూ క్లౌడ్‌బరస్ట్ ప్రభావం స్పష్టంగా కనిపించింది. ఇటీవల కామారెడ్డి జిల్లాలో ఒకే రోజు 70 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ అపూర్వ వర్షపాతం వలన ఉత్తర తెలంగాణ అతలాకుతలమైపోయింది. పలు గ్రామాలు నీటమునిగాయి . వందల ఎకరాల్లో పంటలు పూర్తిగా నష్టపోయాయి. రహదారులు, చెరువులు, వంతెనలు ధ్వంసమయ్యాయి. ప్రభుత్వ అంచనాల ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి వేలకోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. హైదరాబాద్ సహా పట్టణాల్లోనూ రోడ్లు చెరువుల్లా మారాయి. ఈ సంఘటన మరోసారి స్పష్టం చేసింది – క్లౌడ్‌బరస్‌ట్‌లు కేవలం పర్వత ప్రాంతాల సమస్య కాదు, సమతల ప్రాంతాలకూ పెద్ద ముప్పే.

## ఇప్పటివరకు జరిగిన భారీనష్టాలు

- లడఖ్ - 2010 (లేహ్ క్లౌడ్‌బరస్ట్): ఒకే రాత్రిలో కురిసిన భారీ వర్షంతో లేహ్ ప్రాంతంలో గాలజ్‌లు, వరదలు ఏర్పడి 200 మందికి పైగా మృతి చెందారు. వందలాది గృహాలు ధ్వంసమయ్యాయి.
- ఉత్తరాఖండ్ - 2013 (కేదార్‌నాథ్ వరదలు): క్లౌడ్‌బరస్‌ట్‌తో కలిసి హిమపాతాలు రావడంతో, కేదార్‌నాథ్ ఆలయం పరిసర ప్రాంతం అంతా ధ్వంసమైంది. వేలాది యాత్రికులు ప్రాణాలు కోల్పోయారు.
- జమ్ముకాశ్మీర్ - 2014: క్లౌడ్‌బరస్‌ట్‌తో కాశ్మీర్‌లో నదులు ఉప్పొంగి, లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. 500 మందికి పైగా మరణించగా, మౌలిక సదుపాయాలు స్తంభించిపోయాయి.
- హిమాచల్‌ప్రదేశ్ - 2021, 2022: వరుసగా రెండు సంవత్సరాల పాటు చోటుచేసుకున్న క్లౌడ్‌బరస్‌ట్‌ల కారణంగా మణికరణ్ లోయ, కాంగ్రా ప్రాంతాల్లో గృహాలు కొట్టుకుపోయాయి. వందలాది ప్రాణనష్టాలు సంభవించాయి.
- ఈశాన్య రాష్ట్రాలు - 2023: అరుణాచల్‌ప్రదేశం, సిక్కిం, అసోంలో క్లౌడ్‌బరస్‌ట్‌లు సంభవించి రహదారి కనెక్షన్లు తెగిపోయాయి, పంటలు నాశనం అయ్యాయి.
- హైదరాబాద్ - 2020: ఒకే రాత్రిలో 200 మిల్లీమీటర్లకు పైగా వర్షం కురవడం వలన నగరం వరదలో మునిగిపోయింది. ఇది నగరాలూ ఈ విపత్తుకు మినహాయింపు కాదని రుజువు చేసింది.
- కామారెడ్డి 2025 : దాదాపు 700మిమీ వర్షం కురవడం వల్ల కామారెడ్డి, మెదక్ ప్రాంతాల్లో 13మంది మరణించగా, వేలమంది నిరాశ్రయులయ్యారు. హైవేలతో సహా ప్రధానరోడ్లు, భవనాలు ధ్వంసమయ్యాయి.

## విపత్తు ఎందుకొస్తుంది?

క్లౌడ్‌బరస్ట్ అనేది వాతావరణ శాస్త్రపరంగా "ఒక చిన్న పరిధిలో, గంటల వ్యవధిలో, అధిక వర్షపాతం కురవడం" అనే అర్థం. సాధారణంగా గంటలో 100 మిల్లీమీటర్లకు పైగా వర్షం పడితే దాన్ని క్లౌడ్‌బరస్‌ట్‌గా పరిగణిస్తారు.

### ప్రధాన కారణాలు:

- పర్వత ప్రాంత భౌగోళిక నిర్మాణం
- గ్లోబల్ వార్మింగ్ & క్లైమేట్ ఛేంజ్
- మానవ జోక్యం - అడవుల నరికివేత, కాంక్రీట్ కట్టడాల పెరుగుదల
- మాన్సూన్ ప్రోవల మార్పులు

### పరిణామాలు

- ప్రాణ నష్టం
- ఆస్తి నష్టం
- పర్యావరణ దెబ్బ
- ఆర్థిక నష్టం
- సామాజిక ప్రభావం

### ఎలా ఎదుర్కోవాలి?

- ప్రాథమిక హెచ్చరిక వ్యవస్థలు
- మౌలిక సదుపాయాల బలోపేతం
- అడవుల పరిరక్షణ
- పునరావాస ప్రణాళికలు
- పట్టణ ప్రణాళిక
- విపత్తు నిర్వహణ దళాల బలోపేతం

## ప్రకృతి వైపరీత్యం మాత్రమే కాదు

క్లౌడ్‌బరస్ట్ అనేది కేవలం ప్రకృతి వైపరీత్యం మాత్రమే కాదు, మనిషి చేసే పర్యావరణ దోపిడీకి ప్రతిస్పందన కూడా. భవిష్యత్తులో ఇటువంటి విపత్తులను తగ్గించాలంటే సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ఆధునిక టెక్నాలజీ వినియోగం - ఈ మూడు ప్రధాన సూత్రాలపై దృష్టి పెట్టాలి. క్లౌడ్‌బరస్‌ట్‌లు పూర్తిగా నివారించలేము. కానీ వాటి ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు. అందుకోసం ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు, పౌర సమాజం కలిసి పనిచేయాలి. లేదంటే ప్రతి సంవత్సరం పర్వత ప్రాంతాలు, నగరాలు, గ్రామాలు "ఆకాశం పగిలిన వర్షం" భీభత్సాన్ని భరించాల్సి వస్తుంది.

**- మహా నెట్ వర్క్**

**రచనలకు ఆహ్వానం**


ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన **చిరునామా:**
mahaapatrika@gmail.com
whatsapp- 92475 80946

# సైబర్ నేరాలకు అడ్డుకట్ట పడేదెన్నడో?

ప్రజలకు ఎంతగా అవగాహన కల్పించినాకుడా అత్యాశకు పోయి కొందరు,అవగాహన లేక కొందరు,నిజమని భ్రమపడి మరికొందరు సైబర్ వలలో చిక్కి కూడ బెట్టుకున్న సొమ్మును పొగుట్టుకుంటున్నారు.సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త కొత్త విధాలుగా మోసం చేయడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు.ఒక్క 2024 సంవత్సరంలోనే వేల కోట్ల రూపాయలు వారికి చిక్కగా , తిరిగి రాబట్టినవి కొన్ని మాత్రమే. హలో సార్ మా కంపెనీలో పెట్టుబడి పెట్టండి, మీ డబ్బులు రెట్టింపు అవుతాయి, మాలక్కి డ్రా లో మీరు కోటి రూపాయలు గెలుచుకున్నారు, కానీ కొంచెం టాక్స్ కట్టాలి డబ్బులు పంపించండి, మీ లక్కీ ప్రైజ్ మనీని మీకు పంపిస్తాం ఛార్జీలు మీరు భరించాలి కొంత రుసుము పంపండి....ఇలాంటి మాటలు నిజమని నమ్మి నేరగాళ్ల వలలో చిక్కి ఉన్నది పోగొట్టుకుని బంధువులకు మిత్రులకు చెప్పలేక అప్పుల ఉబిలో చిక్కుకుని ఉక్కిరిబిక్కిరి అయిన వారు కొందరైతే....... ఆత్మహత్యలు చేసుకుంటున్న వారు మరికొందరు. మీరు ఫలానా కంపెనీలో లక్కీ కస్టమర్ హైదరాబాద్ పట్టణంలో విల్లా గేలుసుకున్నారు పదిశాతం చెల్లిస్తే, మా కంపెనీ ప్రతినిధి వచ్చి మీకు రిజిస్ట్రేషన్ చేసి ఇస్తారు అనగానే ఎగిరి గంతేసి ఛార్జీలు చెల్లించి చివరకు మోసపోయామని లబోదిబో అన్నవారు ఆలోచించాలి. ఉచితాలు ఎలా వస్తాయని లేదా మనకెందుకు ఇస్తారని ఒక్క క్షణం ఆలోచిస్తే కష్టార్జితం మిగిలేదికదా. ఇలా అంతర్జాలం వేదికగా ఎన్నో రకాల అక్రమాలకు అడ్డగా మారుతున్న సైబర్ మోసలు నగరాలనుంచి పల్లెల వరకు చేరాయి. ఇటీవల అనేక అంతర్జాల మోసాలు పల్లెల్లో కూడా బయట పడుతున్నాయి. పరువు పోతుందనే భయంతో బాధితులు బయటపడడంలేదు మరియు పిర్యాదులు చెయ్యడం లేదు.దీనవల్ల మరికొందరు మోసపోతున్నారు.ఇలా గత కొన్ని సంవత్సరాలుగా మోసాలు జరుగుచున్న, అవగాహన లేని వ్యక్తులు నష్టపోతునే ఉన్నారు. అజ్ఞాత వ్యక్తులు ఫోన్ చేసి ప్రేమగా మాట్లాడి మా కంపెనీలో పెట్టుబడి పెట్టుమని కోరడంతో కొందరు దురాషకు వెళ్లి, అడిగిందే తడవుగా ఆ వ్యక్తి చెప్పిన అకౌంట్ కు డబ్బులు పంపించడం,మొదట కొంత లాభం రావడంతో నమ్మి, అప్పు తెచ్చి, మోసగాడు చెప్పిన అకౌంట్ కు డబ్బులు పంపిస్తు లాభం ఆశతో నష్టపోయి మోసగాడి బెదిరింపులకు భయపడి ఆత్మహత్య చేసుకున్న ఉదంతాలు ఎన్నో ఉన్నాయి.డబ్బులు పంపించి ఆర్థికంగా నష్టపోయి, ఎంతో శ్రమించి సంపాదించిన ఆస్తిని సైతం పోగొట్టుకుని రోడ్డున పడ్డ కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. ఉద్యోగులు, విద్యార్థులే కాకుండా రాజకీయనాయకులు కూడా సైబర్ మోసం నుండి తప్పించుకోలేక పోతున్నారు. తక్కువ రోజుల్లో ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మి ఇన్వెస్ట్ చేసి మోసపోయిన సంఘటనలు, లక్కీ డ్రా వచ్చిందంటూ మెసేజ్ రావడంతో వాటిని నమ్మి కరీంనగర్, నిజామాబాదు హైదరాబాద్ పట్టణాలకు వెళ్లి మరో 50 వేల చొప్పున కట్టి ఆ కంపెనీ బోర్డు తిప్పడంతో భారీగా నష్టపోయిన సంఘటనలు కూడ అనేకం చోటుచేసుకున్నాయి. అంతర్జాల మోసాలకు అంతే లేకుండా పోయింది. ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన సోషల్ నెట్వర్క్‌లో ఒకటి ఫేస్ బుక్.సైబర్ నేరాలకు కేరాఫ్ అడ్రస్‌గా కూడా ఫేస్బుక్ నిలుస్తోంది. ఫేస్బుక్ను అడ్డం పెట్టుకుని చేసే నేరాలలో అకౌంట్లను హ్యాక్ చేయడం, డబ్బును డిమాండ్ చేయడం, వివరాలను దొంగిలించడం, భావోద్వేగాలతో ఆడుకోవడం, షాపింగ్ మోసం, ఫేక్ ఫ్రెండ్ రిక్వెస్టు,అత్యవసరంగా డబ్బులు అవసరం అనే వాటితో మోసాలు వంటివెన్నో జరుగుచున్నాయి ఉంటున్నాయి. ఈ రోజుల్లో సోషల్ నెట్వర్క్ ద్వారా భారీ సంఖ్యలో వ్యక్తులు కనెక్ట్ అయిఉండడం గమనించిన సైబర్ నేరగాళ్లు అందినకాడికి దొచుకుందాం అనే రీతిలో మోసాలకు పాల్పడుతున్నారు. ఫేస్బుక్ హ్యాకింగ్, నకిలీ ప్రొఫైల్ సృష్టించి ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపి వివిధ కారణాలతో వేర్వేరు వ్యక్తులను సంప్రదించి, డబ్బు సంపాదించడానికి ప్రయత్నిస్తారు. ప్రొఫైల్ యజమాని ఈ విషయాన్ని తెలుసుకొని, ఈ వార్తను అందరికీ తెలియజేసే వరకు అతని ప్రొఫైల్ హైజాక్ అయ్యిందని తెలియదు. దీంతో ఫేస్బుక్ ఖాతాకు చెందిన తమ స్నేహితుడి నుండి రిక్వెస్ట్ వచ్చిందని మిగతావారు నమ్ముతారు. ఇది ఫేస్బుక్ చీటింగ్ స్కామ్ కు సంబంధించిన కేసు అని ఆలస్యంగా తెలుసుకుంటారు.ఇలా కొంతమంది డబ్బుపోగొట్టుకున్న వారు కూడా ఉన్నారు. సోషల్ మీడియా లో జరిగే ఆర్థిక మోసలకు అడ్డు కట్టపడడం లేదని,మనదేశంలో సైబర్ నేరాలకు శిక్షలు కఠినంగా లేకపోవడంతో సైబర్ నేరాలు విచ్చలవిడిగా పెరుగు తున్నాయని,సైబర్ క్రైమ్ చట్టాలలో మార్పు, తీసుకువచ్చి మరింత అధునిత సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించడం, పోలీసులు శాఖ ప్రత్యేక నిఘువిభాగలు ఏర్పాటు చేయడం,ముఖ్యంగా ప్రజల్లో అవగాహన కల్పించడం వల్ల ఇలాంటి మోసాలను కట్టడి చెయ్యవచ్చనీ గ్రహించాలి.పండుగలు,ప్రత్యేక రోజులు,నూతన సంవత్సర ఆఫర్ ల పేరుతో జరుగుచున్న మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.



**- గడప రఘుపతిరావు**
రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత
9963499282

# పారదర్శకమైన పాలన కోసమే సమాచార హక్కు చట్టం

## ఆర్టీఐ దరఖాస్తుల పై త్వరగా సమాచారం అందించాలి.. కమిషనర్లు బోరెడ్డి అయోధ్య రెడ్డి, పీవీ శ్రీనివాస్ రావు



**వరంగల్ మహా;** ప్రభుత్వ పాలనలో పారదర్శకత, అధికార యంత్రాంగంలో జవాబుదారీతనమే సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశమని తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్లు బోరెడ్డి అయోధ్య రెడ్డి, పీవీ శ్రీనివాసరావులు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టం 2005పై రాష్ట్ర సమాచార కమిషన్ ఆధ్వర్యంలో పి ఐ ఓ, ఆపిలేట్ అధికారులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి విచ్చేసిన రాష్ట్ర సమాచార కమిషనర్లకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయి, డీసీపీలు షేక్ సలీమా, అంకిత్ కుమార్ లు పూల మొక్కలు, పుష్ప గుచ్చాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర సమాచార కమిషనర్లు పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో వారు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమాచార హక్కు చట్టం అవగాహన సదస్సులో రాష్ట్ర సమాచార హక్కుచట్టం కమిషనర్లు బోరెడ్డి అయోధ్య రెడ్డి, పీవీ శ్రీనివాసరావులు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పౌరులకు పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలన అందించడంలో కీలకమైన సాధనమని తెలిపారు. అవినీతి నిర్మూలనే లక్ష్యంగా సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ఇందులోని అంశాలపై అధికారులు సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఆర్టీఐ దరఖాస్తులు, ఫిర్యాదులు తక్కువ అందిన జిల్లాల్లో వరంగల్ జిల్లా ఓకటన్నారు. పీఐవో అధికారులు ప్రజలకు సకాలంలో పూర్తి సమాచారాన్ని అందించాలని సూచించారు. ఆర్టీఐ దరఖాస్తుల పరిష్కారం ఆలస్యం కాకుండా, చట్టంలో ఉన్న సమయ పరిమితి లోపల సమాధానమివ్వాలని ఆదేశించారు. గత మూడు సంవత్సరాల నుండి 17వేల ఆర్టిఐ కేసులో పెండింగ్లో ఉన్నాయని, వీటిని త్వరితగతిన పరిష్కరించేందుకు జిల్లాల పర్యటనలు చేపట్టి కేసులను అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతోందని అన్నారు. పారదర్శకమైన పాలన కోసం చట్టం ఉపయోగపడాలని, ప్రజలు చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా సదుద్దేశంతో వినియోగించుకోవాలన్నారు. అధికారులు చట్టం పట్ల భయం వీడనాడి నిర్భయంగా యాక్ట్ ప్రకారం అడిగిన సమాచారాన్ని నిర్ణీత సమయంలో అందజేయాలని సూచించారు. ఆర్టిఐ చట్టాన్ని సక్రమంగా అమలు చేస్తే అవినీతి తగ్గిపోతుందని, ప్రజల్లో ప్రభుత్వం పై నమ్మకం, విశ్వాసం పెరుగుతుందని అన్నారు. అన్ని శాఖల అధికారులు 41బి, సిటిజన్ చార్టర్ ను పక్కాగా అమలు చేస్తే సమస్యలు తగ్గుతాయి అన్నారు. పారదర్శకత జవాబుదారీతనంతో నిబంధనలకు లోబడి ఖచ్చితమైన సమాచారం అందించి ప్రజలకు , ప్రభుత్వానికి పౌర సమాచార అధికారులు వారధిగా నిలవాలని సూచించారు. జిల్లాస్థాయిలో ప్రతి మూడు నెలలకు ఒకసారి అధికారులకు చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, జిల్లాలో సమాచార హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలయ్యేలా అధికారులకు పలు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు . ఆర్టీఐ యాక్ట్ లో 31 సెక్షన్లు 6 చాప్టార్లు ఉన్నాయని, సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్క అధికారి అవగాహన పెంచుకోవాలన్నారు. సామాన్య ప్రజలకు నిబంధనలకు లోబడి సమాచారం అందించాలని తెలిపారు. చట్టాన్ని పక్కాగా అమలు చేసేందుకు మే నెలలో కొత్త కమిషనర్లను నియమించడం జరిగిందన్నారు. జిల్లాలో గత సంవత్సరం నుండి అపరిష్కృతంగా ఉన్న ఆర్టీఐ అప్పీల్ కేసులను కలెక్టరేట్లో కమిషన్ ప్రత్యేకంగా పరిష్కారానికి చర్యలు చేపట్టిందన్నారు. అనంతరం సమాచార హక్కు చట్టంపై పిఐఓ, జిల్లా అధికారుల నుండి స్వీకరించిన దరఖాస్తుల పరిష్కరణ, పెండింగ్ గురించి తెలుసుకొని, పిఐఓ, అధికారుల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ సత్య శారద, కమిషనర్లను వరంగల్ ప్రఖ్యాతి గాంచిన చేనేత డ్రి బహుకరించి శాలువ, మెమెంటోలతో సన్మానించారు. జిడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయి, డిసిపి షేక్ సలిమ, అంకిత్ కుమార్ లు శాలువాలతో సత్కరించారు. సమావేశ అనంతరం పెండింగ్ లో ఉన్న ఆర్టిఐ దరఖాస్తులపై ఆర్టిఐ కమిషనర్లు విచారణ నిర్వహించారు. సంబంధిత పీఐవో అధికారులు, దరఖాస్తుదారుల నుండి వివరాలు స్వీకరించి తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఏసీపీ శుభం, డి ఆర్ ఓ విజయలక్ష్మి, ఆర్డిఓలు, వివిధ శాఖల పిఐఓ లు, అప్పీలెట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



**ఆదిలాబాద్ మహా :** జిల్లా విద్యార్థులు క్రీడల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎంపీ గెడెం నగేష్, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శుక్రవారం టిటిడి కల్యాణ మండపం ,ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. భారత హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం క్రీడలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. క్రీడా మహోత్సవం లాగిన్‌ను ముఖ్యఅతిథులు ప్రారంభించారు. ఈ కార్యక్రమాల వలన జిల్లాలో క్రీడలకు ప్రోత్సాహం ఇచ్చే దిశగా ముందడుగు వేస్తాయని, యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు తోడ్పడతాయని అన్నారు. మేజర్ ధ్యాన్ చంద్ భారత హాకీ జట్లకు ఒలింపిక్స్ లో మూడు బంగారు పతకాలు అందించి దేశ ఖ్యాతిని ప్రపంచానికి పరిచయం చేశారనీ ఆన్నారు.ప్రతి సంవత్సరం ఆగస్టు 29 న జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరుపుకుంటామని, క్రీడాకారులు ఉత్సాహంతో పాల్గొంటారని తెలిపారు. పోటీతత్వం, సహకారం , శారీరక శ్రేయస్సు యొక్క శక్తివంతమైన జ్ఞాపకార్థం ఈ రోజు అన్నారు. ఈ ప్రత్యేక రోజు క్యాలెండర్‌లో మాత్రమే కాదు, హాకీ మైదానంలో అతని మాయ సామర్థ్యాలు దేశానికి ఎంతో పేరుతెచ్చాయని అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని, 'ఏక్ గంటా, ఖేల్ కే మైదాన్ మే' అనే థీమ్ తో 'ఫిట్ ఇండియా' ఉద్యమం మూడు రోజుల పాటు దేశవ్యాప్తంగా కొనసాగనుందన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ వో శ్రీనివాస్, పార్థసారథి, అధికారులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# కోట్నాక భీం రావ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

## ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



**కొమురం భీం ఆసిఫాబాద్ మహా :** గిరిజన యువతకు రాజకీయాలు, సమాజ సేవలో ప్రేరణగా నిలిచిన స్వర్గీయ కోట్నాక భీం రావ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆసిఫాబాద్ పట్టణంలో మాజీ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి కోట్నాక భీం రావ్ 23వ వర్ధంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ... భీం రావ్ తన జీవితాన్ని గిరిజనుల అభ్యున్నతికి అంకితం చేశారన్నారు. రాష్ట్రంలో గిరిజన సంక్షేమం కోసం చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదని, గిరిజన హక్కుల కోసం ఆయన చూపిన మార్గంలో నేటి యువత నడవాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కోట్నాక భీం రావ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# గణపతి మండపాల్లో జోరుగా అన్నదాన కార్యక్రమాలు



**వరంగల్ మహా;** వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్ దేశాయిపేట రోడ్డు వర్తక సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉదయం ప్రత్యేక పూజలు మధ్యాహ్నం సుమారు 450 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం తోపాటు సాయంత్రం పెద్ద ఎత్తున మహిళలు పాల్గొనగా కుంకుమ పూజా కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. అలాగే 23వ డివిజన్ లోని శ్రీ పార్వతి పుత్ర యూత్ అసోసియేషన్ వారు నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా యెలుగం వెంకటమల్లు సునంద ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న ప్రసాద వితరణ(అన్నదాన) కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 23వ డివిజన్ మాజి కార్పొరేటర్ యెలుగం లీలావతి సత్యనారాయణ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేశాయిపేట రోడ్డు వర్తక సంఘం శాశ్వత అధ్యక్షుడు డాక్టర్ లయన్ ఆడెపు రవీందర్, సంఘం సభ్యులు, దాతలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసం

## ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

## పాల్గొన్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**హన్మకొండ మహా;** క్రీడలు ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని విద్యార్థులు చదవుతో పాటు క్రీడల్లో రాణించాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్) లోజాతీయ క్రీడా దినోత్సవ వేడుకలకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..గ్రామీణా ప్రాంతాల్లో ఉండే విద్యార్థుల్లో క్రీడ నైపుణ్యం అధికంగా ఉంటుందని ఉపాధ్యాయులు విద్యార్థులను క్రీడల్లో ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఎంపీ సూచించారు. ప్రజా ప్రభుత్వం క్రీడా కారులను ప్రోత్సహిస్తుందని వరంగల్ లో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంజూరు చేయడం ఎంతో అభినందనీయం అని అన్నారు. ఉమ్మడి జిల్లాకు క్రీడా పాఠశాలతోపాటు అంతర్జాతీయ ప్రమాణాలతో క్రికెట్ స్టేడియం మంజూరు రాబోతుందని భవిష్యత్తులో విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కూడా మంచి ఉద్యోగాలు పొందే అవకాశం కూడా ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అధికారి అశోక్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఆవిష్కరణలు వెలికి తీసేలా బోధన చేయాలి

## వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ మహా;** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు భవిష్యత్తులో అవసరమైన సాంకేతిక పరమైన జ్ఞానం, నైపుణ్యాలను సాధించేలా, నూతన ఆవిష్కరణలు వెలికి తీసేలా బోధన చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. శుక్రవారం ఖిలా వరంగల్ మండలంలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో బుక్ అండ్ డిజిటల్ లెర్నింగ్ ఫర్ అటల్ పీఎం శ్రీ పాఠశాలలకు చెందిన భౌతిక గణిత శాస్త్ర సబ్జెక్టుల ఉపాధ్యాయులకు రెండవ రోజు శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిజిటల్ లెర్నింగ్ ద్వారా విద్యార్థులు 21 శతాబ్దానికి తగిన నైపుణ్యాలు జ్ఞానం పొంది భవిష్యత్తు విద్యకు మార్గదర్శకంగా నిలవాలని అన్నారు. విద్యాశాఖ, ఫైజామ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకొని విద్యార్థులను సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించి భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అకాడమీకు మానిటరింగ్ అధికారి సృజన్ తేజ, కోర్స్ కోఆర్డినేటర్ నాగేశ్వర రావు, రిసోర్స్ పర్సన్స్ ప్రభు, సురేష్ గణేష్ సుధాకర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మిస్టరీగా మహిళ మరణం?



**కాటారం, మహా :** భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలాలలోని ఒడితల గ్రామానికి చెందిన కప్పల వర్షిని ఈనెల 3 తేదీన ఇంటి వద్ద అదృశ్యమై మేడిపల్లి అడవిలో మృతదేహమై కనిపించింది. వివరాలలోకెళితే.. మేడిపల్లి అడవిలో కమలాపూర్ పాస్వర్డ్ వద్ద భూపాలపల్లి కాటారం జాతీయ రహదారి పక్కన అడవిలో మహిళా మృతదేహం ఉన్నట్లు కాటారం పోలీసులకు సమాచారం అందింది శుక్రవారం సాయంత్రం మృతదేహాన్ని పరిశీలించారు. శుక్రవారం కాటారం డి.ఎస్.పి సూర్యనారాయణ సిఐ నాగార్జునరావు మృతదేహం వద్ద పరిశీలించారు. రెండు మూడు రోజులుగా వర్షాలు కురియడంతో మహిళ మృతదేహం వద్ద దుర్వాసన ఉంది. పోలీసులు ఇతరులు దుర్వాసనకు లెక్కచేయకుండా శ్రమకోర్చి క్లూస్ టీం ఆధారాలను పరిశీలించి భద్రపరిచారు. సంఘటన స్థలంలోనే మృతదేహానికి డాక్టర్లు పోస్టుమార్టం నిర్వహించారు. ఒడితల గ్రామానికి చెందిన కప్పల వర్షిని ఇంటి నుండి 2 వతేదీ అదృశ్యం కాగా చివరకు మృతదేహమై కనిపించింది. చిట్యాల మండలం కోడితల గ్రామానికి చెందిన కప్పల వర్షిని తండ్రి కుమారస్వామి ఇటీవలే మరణించాడు. ఇంటి నుండి ఎవరికి చెప్పకుండానే వర్షిని వెళ్లిపోయింది. తల్లి కవిత ఆమెజాడ కోసం వెతికిన ఆచూకీ లభించలేదు ఈనెల ఆరవ తేదీన చిట్యాల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసును పోలీసులు నమోదు చేశారు. గురువారం అడవిలో మహిళ మృతదేహం ఉన్నట్లు కాటారం ఎస్ఐ శ్రీనివాస్ కు సమాచారం ఇచ్చారు. కాటారం డిఎస్పి సూర్యనారాయణ రావు సిఐ నాగార్జున రావు ఇద్దరు ఎస్ఐలు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహం గుర్తింపు కోసం తల్లి కవితకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని చూసిన కవిత తన బిడ్డను గుర్తించింది. మృతదేహాన్ని పరిశీలించిన వారు కొన్ని రోజుల క్రితమే మరణించి ఉంటుందని హత్య చేసి శవాన్ని ఇక్కడ పడవేసి ఉండొచ్చని అనుమానిస్తున్నారు పోలీసులు కేసు నమోదు చేసుకుని పూర్తి స్థాయిలో తర్యాప్తు చేస్తున్నారు నిందితులను త్వరలోనే పట్టుకుంటామని కాటారం సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగార్జున రావు తెలిపారు.

# బడా బకాయి దారులే లక్ష్యంగా పన్ను వసూళ్లు చేయండి

## బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్




**వరంగల్ మహా;** బడా బకాయి దారులే లక్ష్యంగా పన్ను వసూళ్లు చేయాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్లో రెవెన్యూ అధికారులు సిబ్బంది తో పన్ను వసూళ్ల పై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశం లో కమిషనర్ పాల్గొని సమర్థవంతం గా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి వార్డ్ ఆఫీసర్ బిల్ కలెక్టర్ ప్రతిరోజు 10 బిల్లులు తప్పక వసూలు చేయాలని పెద్ద మొత్తంలో బకాయి పడి ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి సారించి పన్ను వసూళ్లు జరపాలని వార్డు ఆఫీసర్లకు లాగిన్ లు ఇచ్చి నల్ల కలెక్షన్లను తనిఖీ చేయాలని నల్ల కనెక్షన్ ఉందో లేదో పరిశీలించి ఉన్నట్లయితే సరి అయినదేనా నిర్ధారణ చేయాలన్నారు. ముఖ్యంగా పన్నులు చెల్లించే క్రమంలో కొంతమంది చెక్కు లు అందజేయడం జరుగుతుందని ఇలాంటి సందర్భంలో చెక్ సర్దుబాటు అయిన తర్వాతనే రసీదు అందజేయాలని సూచించారు. ఇళ్ళు మంజూరు అయ్యి ఇందిరమ్మ ఇళ్లు ఇప్పటివరకు నిర్మాణం మొదలు పెట్టని వారికి నోటీసులు ఇచ్చి అనుమతులు రద్దు చేయాలని కొత్తవారు అర్హులు అయి ఇళ్ళు మంజూరు కానీ వారు ఉంటే వారి జాబితాను పంపించాలని మార్క్ ఔట్ ఇవ్వని వారివి వెంటనే మార్కింగ్ ఇవ్వాలని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి రవీందర్ ఆర్ ఓ లు శ్రీనివాస్ షహజాది బేగం ఆర్ ఐ లు తదితరులు పాల్గొన్నారు.

# ఫలించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కావ్య కృషి

## ఉద్యోగుల నియామకానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్



**వరంగల్ మహా;** వరంగల్ సీజిహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ త్వరలోనే ప్రారంభం కానుంది. దీని కోసం చాలా కాలంగా కృషి చేసిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రయత్నాలు ఫలించాయి. వరంగల్‌లో వెల్ నెస్ సెంటర్ ఏర్పాటు, అందులో సిబ్బంది ఏర్పాటు కోసం ఎంపీ డా.కడియం కావ్య నిరంతరం కేంద్ర మంత్రులను కలసి పట్టుదలతో సాధించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ వరంగల్ సీజిహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ త్వరలోనే ప్రారంభం కానుందని అన్నారు. వెల్ నెస్ సెంటర్ ఏర్పాటు, అందులో సిబ్బంది వెంటనే నియమించాలని కేంద్రమంత్రిని కలసి కోరినట్లు ఎంపీ తెలియజేశారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం వెల్ నెస్ సెంటర్‌లో సిబ్బంది నియామకానికి ఉత్తర్వులు జారీ చేసింది . ప్రతి వెల్‌నెస్ సెంటర్ లో 13 మంది ఉద్యోగులు ఉంటారని, వీరిలో డాక్టర్లు, నర్సులు, ఫార్మసిస్ట్ లు, అటెండెంట్లు, ఇతర సిబ్బంది ఉంటారని తెలిపారు. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబాలు చికిత్స కోసం హైదరాబాద్‌కి వెళ్ళాల్సి వచ్చేదని, ఇప్పుడు వరంగల్‌లోనే వైద్య సదుపాయం అందుబాటులోకి రానుందని ఎంపీ స్పష్టం చేసారు. ముఖ్యంగా వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇది మరింత ఉపయోగపడుతుందని తెలిపారు. వరంగల్ తో పాటు దేశవ్యాప్తంగా కొత్తగా 22 సీజిహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇందుకోసం మొత్తం 286 పోస్టులు గాను మొదటి దశలో 88 పోస్టులకు మంజూరు ఇవ్వడం జరిగింది.

# గతుకుల రోడ్లతో ప్రజలు నరకయాతన

## రోడ్ల మరమ్మతులకై ఎమ్మెల్యేను కలిసిన పోల్కంపల్లి నాయకులు

## సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే రంగారెడ్డి హామీ



**రంగారెడ్డి జిల్లా మహా:** గ్రామాలలో ప్రజలకు సమస్యల కారణంగా ఎలాంటి అసౌకర్యం కలగవద్దని అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి గ్రామ ప్రజలు శుక్రవారం తొర్రురులోని క్యాంపు కార్యాలయంలో ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డిని కలవడం జరిగింది. రాయపోల్ నుండి పోల్కంపల్లి వరకు, పోల్కంపల్లి నుండి బాటసింగారం మీదుగా విజయవాడ రహదారిని కలిపే రోడ్డు పూర్తిగా గతుకులమయం అయ్యిందని, గ్రామాల మధ్య రాకపోకలకు నరకయాతనకు గురవుతున్నారని, పోల్కంపల్లి గ్రామానికి చెందిన నాయకులు, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు సమస్య పై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ వెంటనే పంచాయితీరాజ్ డి ఈ కి, ఫోన్ చేసి వీలైనంత తొందరలో సమస్యను పరిష్కారం చేయాలని ఆదేశించడం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామాలలో ప్రజలకు సమస్యల కారణంగా ఎలాంటి అసౌకర్యం కలగవద్దని అన్నారు. కెసిఆర్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఒకవైపు గత పాలకులు చేసిన అప్పులకు మిత్తిలు కడుతూ, మరోవైపు రాష్ట్రాన్ని ప్రగతిపథంలో తీసుకోవడానికి నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. పేదవారి సొంతింటి కళను నెరవేర్చడానికి ఇందిరమ్మ ఇండ్లను అందిస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు పంపిణీ చేశామని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో రాజీపడే ప్రసక్తి లేదని అంచలంచెలుగా నియోజకవర్గం అభివృద్ధి చేస్తానని అన్నారు. బాటసింగారం బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించామని త్వరలోనే రోడ్ల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# యూరియా కోసం క్యూ కట్టిన రైతులు




**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు,మాడుగుల, కడ్తాల్లో శుక్రవారం యూరియా కోసం రైతులు క్యూ కట్టారు. మాడ్గుల మండల కేంద్రంలోని పీఏసీఎస్, ఆగ్రో రైతు సేవ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న యూరియాను తహశీల్దార్ వినయ్ సాగర్, ఏవోఅరుణకుమారి పరిశీలించారు. అవసరం మేరకే యూరియా తీసుకెళ్లాలని, ఇంట్లో నిల్వ చేసుకోవద్దని సూచించారు.జిల్లా వ్యవసాయ అధికారి ఉషతో మాట్లాడి, పత్తి ఎక్కువ సాగు చేస్తున్నందున సరిపడా యూరియా అందజేయాలని కోరారు.

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

## విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి...పాపిశెట్టి రాము



**ఆమనగల్లు,మహా :** విద్యార్థులు చదవుతో పాటు క్రీడల్లో రాణించాలని జేఏసి నాయకులు పాపిశెట్టి రాము సూచించారు. మండలంలోని వివేక విద్యా భారతి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణా ప్రాంతాల్లో ఉండే విద్యార్థుల్లో క్రీడ నైపుణ్యం అధికంగా ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను క్రీడల్లో ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. భారత దిగ్గజం హాకీ ఆటగాడు దేశానికి, క్రీడా రంగానికి ధ్యాన్‌చంద్ చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మహమూద్, కరస్పాండెంట్ గోలి శ్రీనివాసులు, శృతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ చిత్త రంజన్ దాసు, పాఠశాల ఉపాధ్యాయులు మల్లేష్, విజేందర్, కర్ణాకర్, ఆజ్ర, స్వప్న,అరుణ,షమీం,రత్నకుమారి, శంకర్, అంజు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఏడేళ్లలో మహిళల ఉపాధిరేటు రెట్టింపు: కార్మిక శాఖ

మహిళల ఉపాధి రేటు గత 7ఏళ్లలో దాదాపు రెట్టింపైనట్లు కార్మిక శాఖ తాజాగా పేర్కొంది. ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2017 18లోస్త్రీల ఉపాధి రేటు 22 శాతంకాగా.. 2023-24కల్లా 40.3 శాతానికి ఎగసింది. మరో పక్క ఇదే కాలంలో నిరుద్యోగ రేటు 5.6 శాతం నుంచి 3.2 శాతానికి దిగివచ్చింది. 2047కల్లా వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో మహిళా ఉద్యోగుల సంఖ్య 70 శాతానికి చేరుకోవడం కీలకంగా నిలవనున్నట్లు తెలియజేసింది. నియమితకాల శ్రామిక శక్తి సర్వే(పీఎల్ఎఫ్ఎస్) గణాంకాల ప్రకారం గత 7ఏళ్లలో మహిళా ఉపాధి రేటు(డబ్ల్యూపీఆర్) దాదాపు రెట్టింపైంది. వెరసి భారత్‌లో మహిళా ఉద్యోగుల సంఖ్య ప్రస్తావించదగిన స్థాయిలో బలపడింది. ఈ నేపథ్యంలో నిరుద్యోగ రేటు(యూఆర్) సైతం 2017-18లో నమోదైన 5.6 శాతం నుంచి 2023 24కల్లా 3.2 శాతానికి వెనకడుగు వేసింది. ఇది స్త్రీలకు పెరుగుతున్న ఉద్యోగ అవకాశాలను ప్రతిబింబిస్తున్నట్లు కార్మిక శాఖ పేర్కొంది. గ్రామాలలో ఇది మరింత అధికంగా బదిలీ అయినట్లు వెల్లడించింది. పట్టణాలలో ఉపాధి రేటు 43 శాతంకాగా.. గ్రామీణంలో మహిళా ఉద్యోగుల రేటు 96 శాతం జంప్‌చేసినట్లు తెలియజేసింది. 2025 భారత నైపుణ్య నివేదిక ప్రకారం దేశీ గ్రాడ్యుయేట్లలో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 55 శాతంమందికి ఈ ఏడాది ఉపాధి లభించనున్నట్లు పేర్కొంది. 2024లో ఇది 51.2 శాతంగా నమోదైంది.



## జియో ఐపీఓ అప్పుడే..
## క్లారిటీ ఇచ్చిన ముకేశ్ అంబానీ

ప్రముఖ టెలికాం దిగ్గజం రిలయన్స్ జియో.. 2026 ప్రథమార్థంలో ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (IPO) కోసం దాఖలు చేయనున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ 'ముఖేష్ అంబానీ' ప్రకటించారు. ఈ విషయాన్ని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ 48వ వార్షిక సర్వసభ్య సమావేశంలో వెల్లడించారు. 2026 ప్రథమార్థం నాటికి జియోను లిస్ట్ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాము. ఇది అన్ని పెట్టుబడిదారులకు చాలా ఆకర్షణీయమైన అవకాశంగా ఉంటుందని నేను ఖచ్చితంగా అనుకుంటున్నానని ముకేశ్ అంబానీ అన్నారు. అంతే కాకుండా జియో ఇప్పుడు విదేశాలలో కూడా తన కార్యకలాపాలను విస్తరించి.. సొంతంగా ఏఐ సాంకేతికతను అభివృద్ధి చేస్తుందని ఆయన ప్రకటించారు.

### 50 కోట్ల యూజర్లు

రిలయన్స్ జియో ఇప్పటికి 500 మిలియన్స్ లేదా 50 కోట్ల యూజర్లను కలిగి ఉంది. మరో వారంలో జియో ప్రారంభమైన 10 సంవత్సరాలు పూర్తవుతుంది. ఇది జియో ఫ్యామిలీ సాధించిన విషయం. ఇది చాలా గర్వంగా ఉందని ముకేష్ అంబానీ అన్నారు. జియో తన సేవలను దేశంలో విస్తృతంగా అందిస్తోంది. నేడు లక్షలాది మంది భారతీయులు ఈ సేవలను పొందుతున్నారని వెల్లడించారు.


## లాభాలకు బ్రేక్.. నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

శుక్రవారం స్వల్ప లాభాలతో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 270.92 పాయింట్లు లేదా 0.34 శాతం నష్టంతో 79,809.65 వద్ద, నిఫ్టీ 74.05 పాయింట్లు లేదా 0.30 శాతం నష్టంతో 24,426.85 వద్ద నిలిచాయి. జిందాల్ ఫోటో, జిందాల్ పాలీ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ, కృతికా వైర్స్, కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్, ఎల్జీ రబ్బరు వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరగా.. స్టీల్‌కాస్ట్, జీఎస్ఎస్ ఇన్ఫోటెక్, పనామా పెట్రోకెమ్, బాలకృష్ణ పేపర్ మిల్స్, విష్ణు ప్రకాష్



ఆర్ పుంగ్లియా కంపెనీలు నష్టాల జాబితాలో చేరాయి.

## జన్‌ధన్ ఖాతాలు 56.16 కోట్లు..
## డిపాజిట్లు ఎంతంటే?





ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన పథకం కింద ఖాతాల సంఖ్య ఆగస్టు 13 నాటికి 56.16 కోట్లకు చేరింది. ఇందులో రూ.2.68 లక్షల కోట్ల డిపాజిట్లు ఉన్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ ఎక్స్ ప్లాట్‌ఫామ్‌పై ప్రకటించింది. 2015 మార్చి నాటికి ఈ ఖాతాల సంఖ్య 14.72 కోట్లుగా ఉన్నట్టు తెలిపింది. 11 ఏళ్లలో గణనీయంగా పెరిగినట్టు పేర్కొంది. జన్‌ధన్ ఖాతాదారుల్లో 56 శాతం మహిళలేనని.. 67 శాతం ఖాతాలు గ్రామీణ, చిన్న పట్టణాల్లో తెరిచినట్టు వెల్లడించింది. లబ్ధిదారుల ఖాతాలకు ప్రత్యక్ష నగదు బదిలీ రూపంలో రూ.45 లక్షల కోట్లను బదిలీ చేసినట్టు తెలిపింది. జన్‌ధన్ ఖాతాదారులకు 38.68 కోట్ల రూపే డెబిట్ కార్డులు మంజూరైనట్టు వెల్లడించింది. దేశంలో 94 శాతం వయోజనులకు బ్యాంక్ ఖాతాలున్నట్టు తెలిపింది. అందరికీ ఆర్థిక సేవలను చేరువ చేయాలన్న సంకల్పంతో కేంద్ర సర్కారు 2014 ఆగస్ట్ 28న ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన పథకాన్ని ప్రారంభించడం గమనార్హం. దీనికంద సున్నా బ్యాలన్స్, ఉచిత రూపే డెబిట్ కార్డు, ప్రమాద బీమా తదితర సదుపాయాలతో సేవింగ్స్ ఖాతాను ప్రారంభించేందుకు అవకాశం కల్పించింది.

## కార్ లోన్ కస్టమర్లకు గుడ్‌న్యూస్..

పండుగ సీజన్ ప్రారంభాన్ని పురస్కరించుకుని బ్యాంక్ ఆఫ్ బరోడా కారు రుణ వడ్డీ రేట్లను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. బ్యాంక్ ఆఫ్ బరోడా ఫ్లోటింగ్ కార్ లోన్ వడ్డీ రేట్లు ఇప్పుడు సంవత్సరానికి 8.15 శాతం నుండి ప్రారంభమవుతాయి. ఇంతకు మందు ప్రారంభ వడ్డీ రేటు 8.40 శాతం ఉండేది. కొత్త ప్రారంభ 8.15 శాతం వార్షిక వడ్డీ రేటు కొత్త కారు కొనుగోలు రుణాలపై వర్తిస్తుంది. ఆర్బీఐ ఈ ఏడాది మూడు మానిటరీ పాలసీ సమావేశాల్లో రెపో రేటును 100 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఫిబ్రవరి, ఏప్రిల్ పాలసీ సమావేశాల్లో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు, జూన్లో 50 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీంతో చాలా బ్యాంకులు కూడా రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించడం ప్రారంభించాయి.


**తనఖా రుణాలపైనా..**

బ్యాంక్ ఆఫ్ బరోడా తనఖా రుణం (ప్రాపర్టీపై రుణం) వడ్డీ రేట్లను కూడా వార్షికంగా 9.85 శాతం నుంచి 9.15 శాతానికి తగ్గించింది. దరఖాస్తుదారులు బ్యాంక్ డిజిటల్ లెండింగ్ ప్లాట్‌ఫామ్ బరోడా డిజిటల్ కార్ లోన్ ద్వారా బ్యాంక్ ఆఫ్ బరోడా కార్ లోన్‌కు డిజిటల్‌గా దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా సమీప బ్యాంక్ శాఖను సందర్శించవచ్చు. బ్యాంక్ 6 నెలల ఎంసీఎల్ఆర్‌తో లింక్ చేసిన బరోడా కార్ లోన్‌పై ఆకర్షణీయమైన ఫిక్స్డ్ వడ్డీ రేటును కూడా బ్యాంక్ అందిస్తుంది.





## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL




## అమిత్‌షాపై మహువా సంచలన వ్యాఖ్యలు


**న్యూఢిల్లీ:** కేంద్రహోంమంత్రి అమిత్‌షాపై తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మోయిత్రా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. లక్షలాది మంది భారత్‌లో చొరబడుతున్నారు. మన భూమిని ఆక్రమించుకుంటున్నారు. భారత సరిహద్దులు రక్షించలేకపోతే, మహిళల గౌరవం దెబ్బతింటే, కేంద్ర హోం మంత్రి అమిత్ షా బాధ్యత వహించాల్సిందే. అందుకు అమిత్ షా తల నరికించి టేబుల్‌పై పెట్టాలి' అని వ్యాఖ్యానించారు. ఆమె బంగ్లాదేశ్ నుండి అక్రమంగా భారత్‌లోకి చొరబడుతున్న వలసదారుల విషయంపై మాట్లాడుతుండగా చేశారు.




## ట్రంప్ నోబెల్ ఆశలపై నీళ్లు చల్లిన భారత్!!

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నోబెల్ శాంతి బహుమతి కోసం చేస్తున్న నిర్విరామ ప్రయత్నాలపై భారత్ నీళ్లు చల్లిందా? ఆ కోపంతోనే భారత్‌పై అత్యధిక సుంకాలు విధిస్తున్నారా? అంటే అవుననే అంటున్నాయి తాజాగా వెలుగులోకి వచ్చిన నివేదికలు. భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న కుట్ర వెలుగులోకి వచ్చింది. ట్రంప్ తన వ్యక్తిగత స్వార్థం కోసమే భారత్‌పై టారిఫ్‌లు విధిస్తున్నారని,ఇందులో దేశ ప్రయోజనాలే లేవంటూ అమెరికా ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ జెఫరీస్ ఓ నివేదికను విడుదల చేసింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్‌పాక్‌ల మధ్య ఘర్షణను ఆపేందుకు ట్రంప్ మధ్యవర్తిత్వం వహించేందుకు ప్రయత్నించారు. అందుకు భారత్ ఒప్పుకోలేదు. ఫలితంగా తనకు దక్కాల్సిన నోబెల్ ప్రైజ్ భారత్ వల్లే దూరమైందన్న అక్కసతో ఈ టారిఫ్‌లు విధించినట్లు జెఫరీస్ తన నివేదికలో హైలెట్ చేసింది. భారత్‌పై ట్రంప్‌కు వ్యక్తిగత కోపం ఉంది. కాబట్టే ప్రపంచంలోనే భారత్‌పై అత్యధికంగా 50శాతం సుంకాలు విధించినట్లు జెఫరీస్ నివేదిక పేర్కొంది. తద్వారా దీర్ఘకాలంగా అమెరికాభారత్‌ల మధ్య ఉన్న వ్యూహాత్మక సంబంధాలు విచ్ఛిన్నమయ్యాయనే అభిప్రాయ వ్యక్తం చేసింది. భారత్‌పాక్‌ల మధ్య ఘర్షణ వాతావరణాన్ని పూర్తిస్థాయిలో తగ్గించేలా మధ్యవర్తిత్వం వహిస్తానన్న ట్రంప్ ముందుకు రాగా.. అందుకు భారత్ ఒప్పు కోలేదు. దీంతో ఆగ్రహానికి గురైన ట్రంప్ భారత్‌పై సుంకాలు విధిస్తున్న విషయాన్ని వెల్లడించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నోబెల్ శాంతి బహుమతి కోసం నానా తంటాలు పడుతున్నారు. ప్రపంచంలో






ఎక్కడ చిన్న ఘర్షణ జరిగినా.. అక్కడ వాలిపోయి పంచాయితీలు చేస్తున్నారు.తనని తాను ప్రపంచానికి శాంతి దూతగా ప్రచారం చేసుకుంటున్నారు. అదే సమయంలో తన శత్రువు బరాక్ ఒబామా.. అమెరికా అధ్యక్ష పదవి చేపట్టిన తొమ్మిది నెలల్లోనే నోబెల్ శాంతి బహుమతి అందుకోగా లేనిది తన విషయంలో ఎందుకు సాధ్యం కాదని ట్రంప్ ప్రశ్నిస్తున్నారు.

## హృదయ విదారకం!
### చివరి క్షణాల్లో ప్రయాణికులను కాపాడి..



రాజస్థాన్‌లోని పాలి జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. కదిలే బస్సులో ఓ డ్రైవర్ ప్రాణాలు కోల్పోగా.. దానికంటే కొన్ని నిమిషాల ముందే అతను డ్రైవర్ సీటు నుంచి తప్పుకుని హెల్పర్‌కు స్టీరింగ్ అప్పగించాడు. ఈ ఘటన అక్కడున్నవాళ్లను తీవ్రంగా కలిచివేసింది. మధ్యప్రదేశ్ ఇండోర్ నుంచి జోధ్‌పూర్ రాజస్థాన్‌కు ఓ ప్రైవేట్ స్లీపర్ బస్సు వెళ్తోంది. బస్సు పాల్వి జిల్లా కేల్వా రాజ్‌నగర్ చేరుకోగానే.. డ్రైవర్ సతీష్ రావు తనకు ఒంట్లో ఏదోలా అనిపించడంతో వెంటనే స్టీరింగ్‌ను సహచర డ్రైవర్‌కు అప్పగించారు. దగ్గర్లో ఏదైనా క్లినిక్, మెడికల్ షాప్ ఉంటుందోనని చూసినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో అస్వస్థతతోనే సతీష్ బస్సులో అలాగే ముందుకు సాగారు. కాసేపటికే అకస్మాత్తుగా మూర్ఛపోయి కుప్పకూలిన దృశ్యం కనిపించింది. ప్రయాణికులు వెంటనే స్పందించి ఆయనను ఆసుపత్రికి తరలించినా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. సైలెంట్ హార్ట్ అటాక్ కారణంగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తన ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసి.. ప్రయాణికుల ప్రాణాలు కాపాడారంటూ సతీష్‌పై అంతా ప్రశంసలు గుప్పిస్తూ నివాళులర్పిస్తున్నారు.

## స్కూలు టాయిలెట్‌లో బిడ్డకు జన్మనిచ్చిన బాలిక

**బెంగళూరు:** పాఠశాల టాయిలెట్‌లో 9వ తరగతి బాలిక బిడ్డకు జన్మనిచ్చిన ఉదంతం షాహాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటన బయటకు పొక్కగానే అప్రమత్తమైన కర్ణాటక విద్యా సంస్థల సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కాంతరాజు సదరు పాఠశాల ప్రిన్సిపాల్, హాస్టల్ వార్డెన్, సైన్స్ టీచర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌లను సస్పెండ్ చేశారు. షాహాపూర్ పోలీస్ స్టేషన్‌కు అందిన ఫిర్యాదు ప్రకారం ఈ సంఘటన కర్ణాటకలోని యాద్గిర్ జిల్లాలోని షాహాపూర్ తాలూకాలో జరిగింది. స్థానిక ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థిని పాఠశాల టాయిలెట్‌లో మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆ బాలిక గర్భవతి అనే విషయాన్ని ఎవరూ గుర్తించలేదు. 17 ఏళ్ల ఆ విద్యార్థిని తొమ్మిది నెలలపాటు గర్భాన్ని మోసి, బిడ్డకు జన్మనిచ్చింది. జిల్లా బాలల రక్షణ అధికారి నిర్మల షాహాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. డిప్యూటీ కమిషనర్ హర్షల్ భోయార్ ఈ ఘటనపై స్పందిస్తూ, అధికారులు, ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే దీనికి కారణమని ఆరోపించారు. కాగా బాల్య వివాహానికి సంబంధించిన అనుమానాలతో పాటు వివిధ కోణాల నుండి ఈ కేసును పరిశీలిస్తున్నామన్నారు. కర్ణాటక రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కమిషన్ సభ్యుడు శశిధర్ మాట్లాడుతూ పాఠశాలలోని సిబ్బంది తప్పనిసరి తనిఖీలను విస్మరించిందని ఆరోపించారు. హాస్టళ్లలోని విద్యార్థినులకు నెలవారీ ఆరోగ్య, రుతు పరీక్షలను నిర్వహించాల్సివున్నా పాఠశాల యాజమాన్యం అలాంటి పద్ధతిని పాటించలేదన్నారు. కాగా ఆ విద్యార్థిని, ఆమె శిశువు ఆరోగ్యంగా ఉన్నారని, ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. కమిషన్ ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులను ఆదేశించింది. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని సూచించింది.

## నాందేడ్ వరకూ ముంబై-జాల్నా వందేభారత్

**దాదర్:** ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టర్మినస్ (సీఎస్ఎంటీ)-జాల్నా మధ్య నడుస్తున్న వందేభారత్ రైలును నాందేడ్ వరకు పొడిగించారు. మంగళవారం ఉదయం ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వర్చువల్‌గా పచ్చజెండా ఊపి ప్రారంభించినప్పటికీ గురువారం నుంచి ప్రత్యక్షంగా సర్వీసులు అమల్లోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో అదనంగా మరో కొత్త రైలు అందుబాటులోకి రావడంతో మరత్వాడ రీజియన్ ముఖ్యంగా పర్భణీ, పూర్ణ, నాందేడ్ ప్రాంత వాసులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే ముంబై- నాందేడ్ మధ్య నడిచే అనేక రైళ్లున్నాయి. అలాగే నాందేడ్ మీదుగా వెళ్లే మరికొన్ని రైళ్లు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ వందేభారత్ రైలును నాందేడ్‌కు బదులుగా నిజామాబాద్ వరకు పొడిగిస్తే తమకు లాభదాయకంగా ఉండేదని ముంబైలోని నివసిస్తున్న తెలంగాణ ప్రజలు (Telangana Public) అభిప్రాయం వ్యక్తంచేశారు.

**ఆరునెలల క్రింద ప్రారంభం..**

దాదాపు ఆరు నెలల కిందట ముంబై-జాల్నాల మధ్య ప్రారంభించిన 20705/20706 రైలుకు ప్రయాణికుల నుంచి ఆశించినంత మేర స్పందన రాలేదు. దీంతో నాందేడ్ (Nanded) వరకు విస్తరించాలని నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ (ashwini vaishnaw) రెండు నెలల కిందట మహారాష్ట్ర పర్యటన సందర్భంగా ముంబై-జాల్నా మధ్య నడుస్తున్న వందేభారత్ రైలును నాందేడ్ వరకు పొడిగిస్తామని ప్రకటించారు. ముంబై-నాందేడ్ మధ్య ఉన్న 610 కిలోమీటర్ల దూరాన్ని వందేభారత్ రైలు కేవలం 9 గంటల 25 నిమిషాల్లో పూర్తి చేస్తుంది. 18 చైర్ కార్లు, రెండు ఎగ్జిక్యూటివ్ కోచ్‌లు ఇలా మొత్తం



20 బోగీలున్న ఈ రైలులో 1,440 మంది ప్రయాణించేందుకు వీలుంది. 20705 నంబరు రైలు ప్రతీరోజు ఉదయం 5 గంటలకు నాందేడ్ స్టేషన్ నుంచి బయలుదేరి పూర్ణ, పర్భణీ, జాల్నా, ఔరంగాబాద్, మన్మాడ్, నాసిక్, కల్యాణ్, థానే, దాదర్ స్టేషన్ల మీదుగా మధ్యాహ్నం 2.25 గంటలకు సీఎస్ఎంటీకి చేరుకుంటుంది. అలాగే 20706 నంబరు రైలు మధ్యాహ్నం 1.10 గంటలకు సీఎస్ఎంటీ నుంచి బయలుదేరి రాత్రి 10.50 నాందేడ్‌కు చేరుకుంటుంది. ఈ రైలువల్ల రెండు ప్రధాన నగరాల మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికుల విలువైన సమయం ఎంతో ఆదా కానుంది.

**ఇప్పటికైనా స్పందించండి...**

ఇదిలాఉండగా తెలంగాణలోని నిజామాబాద్, ఆర్మూర్, మెట్‌పల్లి, కొరుట్ల, జగిత్యాల, కరీంనగర్ (Karimnagar) ప్రాంత వాసులకు ముంబై నుంచి నేరుగా నడిచే సీఎస్ఎంటీ- లింగంపల్లి దేవగిరి ఎక్స్‌ప్రెస్ రైలు మాత్రమే ఆధారం. అజంతా ఎక్స్‌ప్రెస్ రైలు కూడా ఉన్నప్పటికీ ఇది మన్మాడ్ నుంచి బయలుదేరుతున్న కారణంగా వీరికి అంత సౌకర్యవంతంగా ఉండదు. దీంతో అందుబాటులో ఉన్న ఒకే ఒక్క దేవగిరి ఎక్స్‌ప్రెస్ సీజన్, అన్‌సీజన్ తేడా లేకుండా ఎప్పుడూ కిటకిటలాడుతుంటూంది. అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ముంబై (Mumbai) పర్యటనకు వచ్చిన అనేక మంత్రులు, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులకు ముంబై- నిజామాబాద్ ఒక ప్రత్యేక రైలు కావాలని వేడుకుంటూ అనేక వినతి పత్రాలు ఇచ్చారు. కానీ ఆ లేఖలన్నీ చెత్త బుట్టల పాలయ్యాయి. ఇంతవరకు ఈ విజ్ఞప్తిని పట్టించుకున్న వారే లేరు. ప్రత్యేక తెలంగాణ వచ్చిన తరువాతైనా తమ కల నెరవేతుందని ముంబైలో ఉంటున్న తెలంగాణ వాసులు భావించారు. కానీ అది నెరవేరలేదు. ఈ నేపథ్యంలో తాజాగా ముంబై-జాల్నా మధ్య నడుస్తున్న వందేభారత్ రైలునైనా నిజామాబాద్ వరకూ పొడిగించినా బాగుండేదని, దీని వల్ల రైల్వేకు ఆదాయం కూడా భారీగా సమకూరేదని స్థానిక తెలంగాణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ఈ వందేభారత్ రైలును నిజామాబాద్ వరకూ పొడిగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేస్తున్నారు. నాందేడ్ వరకు విస్తరించారు. దీన్ని నిజామాబాద్ (Nizambad) వరకు పొడగిస్తే తెలంగాణ వాసులకు ఎంతో మేలు జరిగేది. రైల్వేకు కూడా భారీగా ఆదాయం వచ్చేది. కనీసం ఈ వందేభారత్ రైలునైనా నిజామాబాద్ వరకు పొడిగించే ప్రయత్నం చేయాలని ముంబైలో ఉంటున్న తెలంగాణ వాసులు ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు. గణేశోత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం అర్ధరాత్రి 12 గంటల వరకు మెట్రో రైళ్లు నడపనున్నట్లు ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎమ్మెమ్మార్డీయే) నిర్ణయించింది. వివిధ ప్రాంతాల నుంచి వినాయకుని దర్శనానికి వచ్చిన భక్తులు తిరిగి ఇళ్లకు వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకూడదనే ఉద్దేశ్యంతో ఎమ్మెమ్మార్డీయే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. సాధారణంగా మెట్రో రైళ్లు ప్రతీరోజు ఉదయం 5.30 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు నడుస్తాయి. కానీ గణేశోత్సవాల సందర్భంగా ఎదురయ్యే రద్దీని దృష్టిలో ఉంచుకుని నిమజ్జనోత్సవాలు ముగిసే వరకు అంటే సెప్టెంబరు ఆరో తేదీ వరకు 11 రోజులపాటు కొనసాగుతాయని మెట్రో-2ఏ, మెట్రో-7 మార్గాలలో అర్ధరాత్రి 12 గంటలవరకూ సర్వీసులు నడపనున్నట్లు పేర్కొన్నారు. రద్దీకి అనుగుణంగా ట్రిప్పుల సంఖ్య కూడా పెంచినట్లు వెల్లడించారు.



## అక్కినేని నాగార్జున బర్త్ డే.. స్పెషల్ వీడియో చూశారా?

టాలీవుడ్ కింగ్ అంటే ఠక్కున ఆయన పేరే గుర్తుకొస్తుంది. ఆయనకు 65 ఏళ్లు దాటినా ఇంకా యువకుడిలానే కనిపించే తెలుగు హీరోల్లో ఓకే ఒక్కడు. హీరోయిన్లకు మన్మధుడిలా గుర్తుండిపోయిన స్టార్ అతనే. మన తెలుగు సినీ ఇండస్ట్రీలో నవ, యువ మన్మధుడు నాగార్జున అక్కినేని. ఇవాళ 67వ వసంతంలోకి అడుగుపెడుతున్నారు. ఆగస్టు 29న నాగార్జున పుట్టనరోజు కావడంతో అన్నపూర్ణ స్టూడియోస్ ప్రత్యేక వీడియోను పోస్ట్ చేసింది. కింగ్ నాగ్ నటించిన చిత్రాల్లోని సన్నివేశాలను ఓకే వీడియోలో రూపొందించి రిలీజ్ చేసింది. ఈ వీడియో అక్కినేని ఫ్యాన్స్‌ను తెగ ఆకట్టుకుంటోంది. ఇది చూసిన అభిమానులు టాలీవుడ్ కింగ్ నాగార్జున అంటూ కామెంట్స్ చేస్తున్నారు.నాగార్జున ఇటీవలే రజినీకాంత్ మూవీ కూలీలో కనిపించారు. ఈ చిత్రంలో విలన్ పాత్రలో మెప్పించారు. లోకేశ్ కనగరాజ్- రజినీకాంత్ కాంబోలో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచింది. అంతకుముందు శేఖర్ కమ్ముల డైరెక్షన్‌లో వచ్చిన కుబేర మూవీలో కీలక పాత్రలో నటించారు.



## ఓటీటీలో పొలిటికల్ క్రైమ్ థ్రిల్లర్.. ఉచితంగానే చూసేయండి

బాలీవుడ్ నటుడు రాజ్‌కుమార్ రావ్ కీలక పాత్రలో నటించిన గ్యాంగ్‌స్టర్ డ్రామా చిత్రం 'మాలిక్'. గతేడాది స్త్రీ2తో సూపర్ హిట్ కొట్టిన నటుడు.. ఇటీవల భూల్ చుక్ మాఫ్ అనే మూవీతో ప్రేక్షకులను పలరించారు. ఈ క్రమంలోనే జులై 11న మాలిక్ చిత్రం విడుదలైంది. అయితే, ఈ సినిమా అనుకున్నంత రేంజ్‌లో ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. దర్శకుడు పుల్కిత్ తెరకెక్కించిన ఈ మూవీలో మానుషి చిల్లర్ కథానాయికగా నటించారు. మాలిక్ చిత్రం ఇప్పటికే అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతుంది. అయితే, సెప్టెంబర్ 5 నుంచి ఎలాంటి అద్దె చెల్లించకుండా ఈ చిత్రాన్ని చూడొచ్చని ఒక పోస్టర్‌ను విడుదల చేశారు. అమెజాన్ చందాదారుల ఎలాంటి అదనపు రుసుము చెల్లించకుండా ఈ మూవీని చూడొచ్చు. పొలిటికల్ క్రైమ్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రం కొన్ని వర్గాలను అయితే మెప్పించింది. 1988లో అలహాబాద్‌లో జరిగిన సంఘటనల ఆధారంగా ఈ సినిమాను నిర్మించారు. రాజ్‌కుమార్ రావు గ్యాంగ్‌స్టర్‌గా మెప్పించిన ఈ చిత్రాన్ని టిప్స్ ఫిల్మ్స్, నార్తర్న్ లైట్స్ ఫిల్మ్స్ బ్యానర్లపై కుమార్ తౌరానీ, జే షెవాక్రమణి నిర్మించారు.

## తను పక్కన లేకుంటే నిద్ర పట్టేదికాదు

'ఓ దశ వరకూ తల్లిదండ్రుల సహకారం ప్రతి ఒక్కరికీ అవసరమే. ఈ విషయంలో ఎవరూ మినహాయింపు కాదు..' అంటున్నారు అందాలభామ శ్రీలీల. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన తల్లితో తనకున్న అనుబంధాన్ని వివరించారామె. అలాగే కెరీర్ పట్ల తాను తీసుకున్న కొత్త నిర్ణయాన్ని కూడా తెలియజేశారు. 'చాలా చిన్న వయసులో నటిని అయ్యాను. ఆ టైమ్‌లో సినిమా ప్రపంచం ఎలా ఉంటుందో నాకు తెలీదు. అందుకే నాతో పాటు అమ్మ కూడా లొకేషన్‌కి వచ్చేది. అలాగే నా కథలు కూడా అమ్మే వినేది. నా సినిమాలను కూడా అమ్మే నిర్ణయించేది. ఈ కారణంగా ఆమె కెరీర్ చాలా నష్టపోయింది. ప్రస్తుతం నేను ఈ స్థాయిలో ఉన్నానంటే కారణం మా అమ్మ. కొన్ని నెలల క్రితం వరకూ కూడా అమ్మ పక్కన లేకుండా నిద్ర పోయేదాన్ని కాదు. ఇప్పడిప్పడే సోలో లైఫ్ అలవాటు చేసుకుంటున్నా. అది కూడా అమ్మ నిర్ణయమే. ఎప్పడూ ఒకరిపై ఆధారపడ కూడదు అనేది అమ్మ ఫిలాసఫీ. నిజానికి ఇకపై నిర్ణయం నాదే అయినా.. ఫైనల్ డెసిషన్ మాత్రం అమ్మదే. వృత్తిపరంగా, వ్యక్తిగతంగా నా ప్రయాణాన్ని నేను చక్కబెట్టుకోవాలనేది అమ్మ ఆకాంక్ష. ఓ విధంగా మా అమ్మ నా బాధ్యతను పెంచింది.'అంటూ శ్రీలీల చెప్పకొచ్చారు. రవితేజతో ఆమె నటించిన 'మాస్ జాతర' చిత్రం త్వరలో విడుదల కానుంది. అలాగే పవన్‌కల్యాణ్ 'ఉస్తాద్ గబ్బర్‌సింగ్'లోనూ శ్రీలీలే కథానాయిక. హిందీలో కూడా ఓ సినిమా చేస్తూ బిజీగా ఉన్నాది ఈ తెలుగందం.



### రెండు నెలల్లో ఇంత మార్పు..

## సీరియస్‌గా తీసుకుందా?

హీరోయిన్లు తమ గ్లామర్, లుక్స్ మెంటైన్ చేసినన్నీ రోజులు బాగానే ఉంటుంది. కానీ కాస్త బరువు పెరిగినా, బొద్దుగా కనిపించినా సరే సోషల్ మీడియాలో ట్రోల్స్ లాంటివి మొదలవుతాయి. రీసెంట్ టైంలో అలా చర్చకు కారణమైన హీరోయిన్ నివేతా థామస్. స్వతహాగా మలయాళీ అయినప్పటికీ తెలుగులో బోలెడు సినిమాలు చేసింది. నిన్ను కోరి, జై లవకుశ, బ్రోచేవారెవరురా, 118, వకీల్ సాబ్ తదితర చిత్రాలు ఈమెకు మంచి గుర్తింపు తీసుకొచ్చాయి.

చివరగా '35ఇది చిన్న కథ కాదు' అనే తెలుగు మూవీలో కనిపించిన నివేతా.. తర్వాత పెద్దగా బయట కనిపించలేదు. ఈ జూన్‌లో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన గద్దర్ అవార్డుల వేడుకలో పాల్గొంది. ఇదే చిత్రానికిగానూ ఉత్తమ నటిగా పురస్కారం కూడా అందుకుంది. అయితే ఈ ఈవెంట్‌లో చీరలో నివేతా కనిపించింది. కానీ ఆమె బొద్దుగా ఉండటంపై సోషల్ మీడియాలో డిస్కషన్ జరిగింది. మరీ ట్రోల్‌స్‌ని సీరియస్‌గా తీసుకుందా ఏమో గానీ ఇప్పుడు కొత్త లుక్‌లో కనిపించింది.

గద్దర్ అవార్డ్ ఈవెంట్ ఫొటోల తర్వాత దాదాపు రెండు నెలల తర్వాత తాజాగా ఇన్ స్టాలో నివేతా కొన్ని ఫొటోలు షేర్ చేసింది. అంతకు ముందుతో పోలిస్తే ఇప్పుడు కాస్త బరువు తగ్గినట్లు కనిపిస్తుంది. దీంతో రెండు నెలల్లోనే ఇంత మార్పు అని నెటిజన్లు కామెంట్స్ పెడుతున్నారు. టాలీవుడ్‌లోని బెస్ హీరోయిన్లలో ఈమె కూడా ఒకరు. కళ్లతోనూ హావభావాలు పలికించగలదు. కాకపోతే ఎన్టీఆర్ తప్పితే స్టార్ హీరోల చిత్రాల్లో ఈమెకు పెద్దగా అవకాశాలు రాలేదు. మరి ఇప్పుడు బరువు తగ్గడంతో మళ్లీ తెలుగులో బిజీగా అవుతుందేమో చూడాలి?



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com